Yuvatharam Telugu Daily RNI APTEL/2023/88231

# యువతరం

ఎడిటర్ : ఆర్. చంద్రశేఖర్ రావు
The Voice of youth
Postal Regd.No. KNL/3-77(D)/2025-2027
తెలుగు దినపత్రిక

ప్రచురణ : కర్నూలు, అనంతపురం | సంపుటి : 03 | సంచిక : 260, | పేజీలు : 08, | వెల రూ. 4 రూ/ | శనివారం 18- 04 - 2026

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, circulated by Adilabad,Bhadradri Kothagudem,Hanumakonda. Jagtial,,Jangoan,Jayashankar Bhupalapally,Jogulamba Gadwal, Kamareddy,Karimnagar,Khammam, Kumuram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak ,Medchal Malkajgiri, Mulugu, Nagarkurnool,Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal,




చెవిరెడ్డి కుటుంబ అవినీతి మట్టాన్నీ త్వరలో బయటపెడతాం.. పులివర్తి నాని వార్నింగ్

**విలేఖరులు కావలెను**

రెండు తెలుగు రాష్ట్రాలలో నూతనంగా ప్రారంభించిన యువతరం తెలుగు దినపత్రిక లో పనిచేయడానికి జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గ ప్రతినిధులు, మండల స్థాయి విలేఖరులు కావలెను.

సంప్రదించవలసిన నెంబర్

9989924749
7013007309

## కీలక వాణిజ్య చర్చలకు ముందు, అమెరికా ప్రతినిధితో భారత రాయబారి భేటీ




ఇండియా హౌస్‌లో జేమీసన్ గ్రీర్‌తో వినయ్ మోహన్ క్వాత్రా సమావేశం

సమావేశంలో పాల్గొన్న అమెరికా జాతీయ భద్రతా మాజీ సలహాదారు

ట్రేడ్ డీల్ కోసం వచ్చే వారం అమెరికా వెళ్లనున్న భారత బృందం




## డీలిమిటేషన్ లో తెలంగాణకు అన్యాయం జరగకుండా చూడాలి

- రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు
- దక్షిణాది రాష్ట్రాలను డీలిమిటేషన్ పేరుతో శిక్షించడం సరికాదు
- తెలంగాణ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజలు రోడ్లపైకి వస్తారు: కవిత

హైదరాబాద్: తెలంగాణ ప్రాతినిధ్యాన్ని దెబ్బతీసేలా కేంద్రం అడుగులు వేస్తే చూస్తూ ఊరుకోబోమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు


# మండుతున్న ఎండలు..

## తెలంగాణలో పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

- ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఎండ ప్రచండమే.. వడగాలులతో జాగ్రత్త.
- ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.5 నుంచి 4.5 డిగ్రీలు పెరిగే అవకాశం
- ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మంలో మరో వారంపాటు జాగ్రత్తగా ఉండాలి
- వృద్ధులు, వృద్ధురాలు, గర్భిణీలు, నిర్మాణ రంగ కార్మికులు అప్రమత్తంగా ఉండాలి
- చలివేంద్రాలను ప్రోత్సహించండి.. పీహెచ్‌సీల్లో ప్రాథమిక చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచండి
- జిల్లాల కలెక్టర్లకు సర్క్యూలర్ పంపిన విపత్తుల నిర్వహణ శాఖ




హైదరాబాద్: రోజురోజుకూ పెరుగుతున్న ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచించింది. ఈ వేసవి గతం కంటే భిన్నంగా ఉండే అవకాశం ఉందని, భారీ స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరగొచ్చని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ చర్యలు తీసుకోవాలని జిల్లాల కలెక్టర్లను కోరింది. ఈ మేరకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిశోర్ అన్ని జిల్లాల కలెక్టర్లకు సర్క్యులర్ పంపారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయని, మిగతా..2లో



## రాష్ట్రంలో 56.36 శాతంతో బీసీలదే అగ్రస్థానం

- తెలంగాణ కుల సర్వే అధికారిక గణంకాలను విడుదల చేసిన ప్రభుత్వం
- తెలంగాణలో టాప్ 3 కులాలు ఇవే... నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం
- జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో
- ఓసీల్లో రెడ్డి, ఎస్టీల్లో లంబాడీల జనాభా అత్యధికం

తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేకు సంబంధించిన మిగతా..2లో

## మహిళా బిల్లుతో దేశ రాజకీయాల దిశ, దశ మారతాయి

### లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం

- బిల్లుపై మూజువాణి ఓటింగ్‌ను వ్యతిరేకించి డివిజన్‌కు పట్టుబట్టిన విపక్షాలు
- ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 251, వ్యతిరేకంగా 185 ఓట్లు
- బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని పార్టీలకు ప్రధాని విజ్ఞప్తి



ఢిల్లీ: మహిళా రిజర్వేషన్ బిల్లు దేశ రాజకీయాల దిశ, దశను మార్చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలు నిర్ణయాధికార ప్రక్రియలో పాలుపంచుకోవడం ద్వారా దేశానికి కొత్త దిశానిర్దేశం మిగతా..2లో




## తిరుమల శ్రీవారి దర్శనానికి 8 గంటల సమయం

- తిరుమల కొండపై ఓ మోస్తరు రద్దీ
- భక్తులతో నిండిన 18 కంపార్ట్‌మెంట్లు
- శ్రీవారిని దర్శించుకున్న 77,077 మంది భక్తులు
- హుండీ ద్వారా రూ.3.47 కోట్ల ఆదాయం




## ప్రపంచ శాంతికి ఎదురయ్యే సవాళ్ల పరిష్కారానికి కృషి చేయాలి

ప్రధాని మోదీ పిలుపు

అంతర్జాతీయ సంస్థలకు ప్రధాని మోదీ సూచన

పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో సుస్థిర, సుదీర్ఘ శాంతి కొనసాగాలన్న మోదీ

ఆస్ట్రియా ఛాన్సెలర్‌తో కలిసి ప్రెస్ మీట్‌లో పాల్గొన్న మోదీ

## మహిళా బిల్లుపై పార్లమెంట్ లో చర్చ..

### అమిత్ షా, అఖిలేశ్ ల మధ్య మాటల యుద్ధం

‘ఉప-కోటా ’ కోసం అఖిలేశ్ డిమాండ్.. కుదరదని తేల్చిచెప్పిన అమిత్ షా

ఓబీసీ, ముస్లిం మహిళలకు సబ్-కోటా ఇవ్వాలని అఖిలేశ్ డిమాండ్

మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కుదరవన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై (నారీ శక్తి వందన్ అధినియం) పార్లమెంటులో వాడివేడి చర్చ జరిగింది. ఈ బిల్లులో ఓబీసీ, ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా కల్పించాలన్న డిమాండ్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ మధ్య తీవ్ర వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. ఈ చర్చలో అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ.. మహిళలకు మిగతా..2లో



# నారీశక్తి అనేది నినాదం కాదు మన నాగరికతకు బలం

## నారీ శక్తి చట్టం చరిత్రాత్మకం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మక ముందడుగు అని కొనియాడిన పవన్
- మహిళా సాధికారతకు జనసేన పార్టీ కట్టుబడి ఉందని స్పష్టీకరణ
- వివిధ రంగాల్లో రాణిస్తున్న భారత మహిళల విజయాలను ప్రస్తావించిన పవన్
- రాజ్యాంగ రూపకల్పనలో మహిళల పాత్రను గుర్తు చేసుకున్న జనసేనాని



అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తీసుకువచ్చిన ‘నారీ శక్తి వందన్ అధినియం సవరణ బిల్లు‘ ఒక చరిత్రాత్మక ముందడుగు అని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా పాలనలో వారికి సముచిత స్థానం దక్కుతుందని ఆయన ఒక ప్రకటనలో మిగతా..2లో



## కాకినాడ సెజ్‌కు మరో భారీ పరిశ్రమ.. రూ.700 కోట్ల పెట్టుబడితో ప్లాంట్

- రూ.700 కోట్ల పెట్టుబడితో చెన్నై చెన్నెకి చెందిన గ్రీన్ కోక్ ఎనర్జీ ప్లాంట్ (2లో)
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 2000 మందికి ఉపాధి అవకాశం
- స్టీల్ ఉత్పత్తిలో వాడే మెటలర్జికల్ కోక్‌ను తయారు చేయనున్న కంపెనీ

అమరావతి: ఏపీలో పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తున్నాయి.




## రాష్ట్రానికి కంపెనీలు వస్తుంటే తరిమేస్తామనడం రాక్షస మనస్తత్వం

- ఇదేం రాక్షస మనస్తత్వం?: జగన్‌పై మంత్రి లోకేశ్ ఫైర్
- వైసీపీ, జగన్‌పై మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శలు
- మత్స్యకారుల పిల్లలకు వెయ్యికి పైగా ఉద్యోగాలు వస్తుంటే అడ్డుకుంటారా అని ప్రశ్న
- తల్లిని, చెల్లిని గెంటేశారంటూ పరోక్షంగా ఘాటు వ్యాఖ్యలు

అమరావతి: రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ప్రతిపక్ష వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిని ఉద్దేశిస్తూ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మిగతా..2లో

## ఆధిపత్యం కోసం చూస్తే క్షిపణితో దాడి చేస్తాం

### అమెరికాకు ఇరాన్ హెచ్చరిక




హార్మూజ్ జలసంధిపై ఆధిపత్యం కోసం అమెరికా ప్రయత్నిస్తోందన్న ఇరాన్

మేం క్షిపణి దాడి చేస్తే అమెరికా నౌకలు ధ్వంసమవుతాయని హెచ్చరిక

మేం దాడి చేస్తే అమెరికా బలగాల ప్రాణాలు కూడా పోవచ్చని వ్యాఖ్య

## అమెరికా స్థావరాలపై ఇరాన్ నిఘా.. సాయం చేసిన చైనా శాటిలైట్!




గతేడాది రహస్యంగా శాటిలైట్‌ను సమకూర్చుకున్న ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్

సౌదీ, జోర్డాన్, ఇరాక్‌లోని యూఎస్ బేస్‌ల కదలికలను ట్రాక్ చేసిన వైనం

చైనా ప్రభుత్వ అనుమతితోనే ఇది జరిగిందంటున్న నిపుణులు

యువతరం న్యూస్
The Voice of youth
శనివారం 18-04-2026

## కీలక వాణిజ్య చర్చలకు ముందు, అమెరికా ప్రతినిధితో భారత రాయబారి భేటీ

ఢిల్లీ: అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా వాషింగ్టన్‌లో అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమీసన్ గ్రీర్, జాతీయ భద్రతా మాజీ సలహాదారు రాబర్ట్ ఓ'బ్రియన్‌లతో భేటీ అయ్యారు. భారత్, అమెరికా మధ్య మరోసారి వాణిజ్య చర్చలు జరగనున్న తరుణంలో, ఈ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిపేందుకు భారత అధికారుల బృందం అమెరికాను సందర్శించనుంది. ఈ క్రమంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన అంశంపై జెమీసన్ గ్రీర్, వినయ్ మోహన్ క్వాత్రా చర్చించారు. “ఈరోజు ఇండియా హౌస్‌లో అంబాసిడర్ జేమీసన్ గ్రీర్, అంబాసిడర్ రాబర్ట్ ఓ'బ్రియన్‌లకు ఆతిథ్యం ఇవ్వడం గౌరవంగా భావిస్తున్నాం“ అని వినయ్ మోహన్ క్వాత్రా 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ద్వైపాక్షిక సహకారంపై ఇరుదేశాలకు ఉన్న అవకాశాలపై చర్చించినట్లు తెలిపారు. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న కీలక పరిణామాలపై చర్చించామని వెల్లడించారు. వాణిజ్య చర్చల కోసం భారత బృందం వచ్చేవారం వాషింగ్టన్ వెళ్లనుంది. భారత్, అమెరికా ప్రతినిధులు ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు వాషింగ్టన్‌లో చర్చలు జరపనున్నారు.

## ఆధిపత్యం కోసం చూస్తే క్షిపణితో దాడి చేస్తాం

### అమెరికాకు ఇరాన్ హెచ్చరిక

ఢిల్లీ: హర్మూజ్ జలసంధితో పాటు ఇరాన్ నౌకాశ్రయాల వద్ద పెద్ద ఎత్తున సైనికులను మోహరించిన అమెరికాకు ఇరాన్ గట్టి హెచ్చరిక చేసింది. హర్మూజ్ జలసంధిపై ఆధిపత్యం కోసం అమెరికా ప్రయత్నాలు చేస్తే తమ తొలి క్షిపణికే ఆ దేశానికి చెందిన నౌకలు మునిగిపోతాయని హెచ్చరించింది. ఇరాన్‌కు వెళ్లే, ఇరాన్ నుంచి వెలుపలకు వచ్చే నౌకలను అడ్డుకుంటున్నట్లు అమెరికా ప్రకటించింది. దీనితో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ సైనిక సలహాదారు మెహ్‌సేన్ రెజాయి అమెరికాకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. హర్మూజ్‌కు ట్రంప్ రక్షణంగా ఉండాలనుకుంటున్నారని, కానీ అమెరికా వంటి శక్తిమంతమైన సైన్యం చేయాల్సిన పని ఇదేనా? అని ప్రశ్నించారు. జలసంధిపై ఆధిపత్యం చేయాలని చూస్తే ఇరాన్ తొలి క్షిపణి దాడి అమెరికా పైకే ఉంటుందని అన్నారు. మా క్షిపణులు కచ్చితమైన దాడులు చేసి మీ నౌకలను ధ్వంసం చేయగలవని హెచ్చరించారు. తాము దాడి చేస్తే ఆ ప్రాంతంలో ఉన్న అమెరికా బలగాల ప్రాణాలు కూడా పోవచ్చని వ్యాఖ్యానించారు.

### అమెరికా స్థావరాలపై ఇరాన్ నిఘా..

## సాయం చేసిన చైనా శాటిలైట్!

ఢిల్లీ: పశ్చిమాసియాలో ఇటీవల ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సమయంలో అమెరికా సైనిక స్థావరాలపై నిఘా పెట్టేందుకు ఇరాన్ చైనా తయారీ శాటిలైట్‌ను ఉపయోగించుకుందని ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో వెల్లడించింది. ఈ పరిణామం గల్ఫ్ దేశాల్లో తీవ్ర ఆందోళనలకు కారణమవుతోంది. ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ప్రకారం, గతేడాది ఇరాన్ రహస్యంగా పొందిన ఈ శాటిలైట్ పేరు ౹జుజు-01డీ. దీనిని చైనాకు చెందిన 'ఎర్త్ ఐ కంపెనీ' అభివృద్ధి చేసి ప్రయోగించింది. అనంతరం ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఏరోస్పేస్ విభాగానికి దీనిని అప్పగించారు. కక్ష్యలోకి విజయవంతంగా చేరిన తర్వాతే విదేశీ కొనుగోలుదారులకు ఉపగ్రహాలను బదిలీ చేసే 'ఇన్-ఆర్బిట్ డెలివరీ' అనే పద్ధతిలో ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంలో భాగంగా బీజింగ్‌కు చెందిన ఎంపోశాట్ అనే మరో సంస్థకు చెందిన కమర్షియల్ గ్రౌండ్ స్టేషన్ల నెట్‌వర్క్‌ను కూడా ఇరాన్ వినియోగించుకునేందుకు అనుమతి లభించింది. ఈ శాటిలైట్‌ను ఉపయోగించి పశ్చిమాసియాలోని కీలకమైన అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ నిఘా పెట్టింది. మార్చి 13, 14, 15 తేదీల్లో సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్ చిత్రాలను ఈ శాటిలైట్ బంధించింది. అదే సమయంలో జోర్డాన్‌లోని మువాఫక్ సల్తి ఎయిర్ బేస్, బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో ఫ్లీట్ హెడ్ క్వార్టర్స్ సమీప ప్రాంతాలు, ఇరాక్‌లోని ఎర్బిల్ ఎయిర్‌పోర్ట్ వద్ద కార్యకలాపాలను కూడా ట్రాక్ చేసినట్లు ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొంది. కువైట్‌లోని క్యాంప్ బ్యూహ్రింగ్, అలీ అల్ సేలం ఎయిర్ బేస్ వంటి అమెరికా సంబంధిత స్థావరాలు కూడా దీని నిఘా నీడలోనే ఉన్నాయి. “చైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ చైనా కంపెనీ ఇలాంటి ఉపగ్రహాన్ని ప్రయోగించడం అసాధ్యం. చైనా చాలా కాలంగా ఇరాన్‌కు నిఘా సమాచారంతో సాయం చేస్తోంది, అయితే ప్రభుత్వ ప్రమేయం బయటపడకుండా జాగ్రత్త పడుతోంది“ అని పాశ్చాత్య దేశాలకు చెందిన ఓ మాజీ సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారి వ్యాఖ్యానించారు. అయితే, ఇరాన్‌కు ఎలాంటి సైనిక మద్దతు ఇవ్వడం లేదని చైనా విదేశాంగ శాఖ గత కొన్ని రోజులుగా ఖండిస్తూ వస్తోంది. చైనా చాలా కాలంగా ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమానికి మద్దతు ఇస్తోందని, క్షిపణుల తయారీకి ఉపయోగపడే ద్వంద్వ వినియోగ పారిశ్రామిక భాగాలను అందిస్తోందని అమెరికా ప్రభుత్వం ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చైనా-ఇరాన్ బంధంపై గల్ఫ్ దేశాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## ప్రపంచ శాంతికి ఎదురయ్యే సవాళ్ల పరిష్కారానికి కృషి చేయాలి

ఢిల్లీ: అంతర్జాతీయ సంస్థలు ప్రపంచశాంతికి ఎదురయ్యే సవాళ్ల పరిష్కారానికి కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించారు. పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో సుస్థిర, సుదీర్ఘ శాంతి కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఆస్ట్రియా ఛాన్సెలర్ క్రిస్టియన్ స్టాకర్‌తో కలిసి ప్రధాని మోదీ ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యుద్ధ క్షేత్రాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం ప్రపంచ దేశాలపై పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని దేశాల యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. ఈ యుద్ధం ప్రభావం ప్రజల జీవన విధానంపై పడుతోందని అన్నారు. ఉక్రెయిన్ లేదా పశ్చిమాసియా ఏదైనా సమస్య శాశ్వతంగా పరిష్కారమై, శాంతి, సుస్థిరత కావాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు. సవాళ్లను ఎదుర్కోవడానికి సరికొత్త సంస్కరణలు చేపట్టవలసి ఉందని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులను తుదముట్టించడం కూడా అవసరమని అన్నారు. ఆస్ట్రియా ఛాన్సెలర్ రాకతో దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత భారత్‌లో వాణిజ్య పెట్టుబడుల రంగంలో నూతనోత్సాహం మొదలైందని అన్నారు. భారత్-ఈయూ మధ్య కొత్త ఒప్పందాలతో సువర్ణాధ్యాయం ప్రారంభం కానుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.

## తిరుమల శ్రీవారి దర్శనానికి 8 గంటల సమయం

తిరుపతి: తిరుమల శ్రీవారి సన్నిధిలో భక్తుల రద్దీ ఓ మోస్తరుగా కొనసాగుతోంది. టైమ్ స్లాట్ సర్వదర్శనం (ఎస్ఎస్ డీ) టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనం కోసం సుమారు 8 గంటల సమయం పడుతోందని అధికారులు తెలిపారు. గురువారం ఉదయం నాటికి, తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 18 కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండి ఉన్నాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా టీటీడీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. (ఏప్రిల్ 15) ఒక్కరోజే 77,077 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది. 27,241 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీకి రూ.3.47 కోట్ల ఆదాయం లభించింది.

## డీలిమిటేషన్ లో తెలంగాణకు అన్యాయం జరగకుండా చూడాలి

హైదరాబాద్: తెలంగాణ ప్రాతినిధ్యాన్ని దెబ్బతీసేలా కేంద్రం అడుగులు వేస్తే చూస్తూ ఊరుకోబోమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో కేంద్రం ప్రతిపాదించిన మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లులపై ఆమె తీవ్రంగా స్పందించారు. దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సంఖ్య పెంచే ప్రక్రియలో భాగంగా తెలంగాణ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజలు రోడ్లపైకి వస్తారని, ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో తెలంగాణకు ఉన్న 3.13 శాతం ప్రాతినిధ్యాన్ని బేస్‌లైన్‌గా పరిగణించాలని, పునర్విభజన తర్వాత కూడా ఈ శాతం తగ్గకుండా చూడాలని కవిత డిమాండ్ చేశారు. నియోజకవర్గాల సంఖ్య పెరిగినప్పటికీ, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ ప్రాతినిధ్యం తగ్గితే అది ప్రాంతీయ అసమానతలకు దారితీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న దక్షిణాది రాష్ట్రాలను డీలిమిటేషన్ పేరుతో శిక్షించడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడంపై కవిత అసహనం వ్యక్తం చేశారు. మహిళా బిల్లును ఓబీసీ రిజర్వేషన్లతో ముడిపెట్టాలని, 33 శాతం కోటాలో ఓబీసీ మహిళలకు ప్రత్యేక వాటా కల్పిస్తేనే నిజమైన సామాజిక న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కేంద్రం వ్యవహరిస్తే వీధుల నుంచి పార్లమెంట్ వరకు పోరాటం చేస్తామని ఈ సందర్భంగా ఆమె ప్రకటించారు.

## రాష్ట్రానికి కంపెనీలు వస్తుంటే తరిమేస్తామనడం రాక్షస మనస్తత్వం

అమరావతి: రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ప్రతిపక్ష వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిని ఉద్దేశిస్తూ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. రాష్ట్రానికి మంచి చేసే కంపెనీలు వస్తుంటే అడ్డుకోవడం దుర్మార్గమని, ఇది సైకోయిజం తప్ప మరొకటి కాదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు లోకేశ్ తన సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. దేశ రక్షణకు ఉపయోగపడే అధునాతన బోట్లు తయారు చేసే కంపెనీ రాష్ట్రానికి వస్తుంటే స్వాగతించాల్సింది పోయి, తరిమేస్తామనడం ఎలాంటి మనస్తత్వమని లోకేశ్ ప్రశ్నించారు. ఈ కంపెనీ ద్వారా మత్స్యకారుల పిల్లలకు వెయ్యికి పైగా ఉద్యోగాలు వస్తాయంటే ఆనందించకుండా అడ్డుకుంటాననడం రాక్షస మనస్తత్వమే అవుతుందని అన్నారు. ఇదే క్రమంలో ఆయన జగన్‌పై పరోక్షంగా వ్యక్తిగత విమర్శలు కూడా చేశారు. “తల్లిని తరిమేశారు, చెల్లిని గెంటేశారు. దైవం అంటే భక్తి లేదు. దేశం అంటే ద్వేషం. నిలువెల్లా స్వార్థం, మనసంతా విధ్వంసంతో రప్పా రప్పా నరుకుతాం, అమరావతిని మార్చేస్తాం, కట్టినవన్నీ కూల్చేస్తాం, కంపెనీలన్నీ వెళ్లగొడతాం.. ఏమిటీ దుర్మార్గ పనులు జగన్ మోహన్ రెడ్డి గారూ!“ అని తన పోస్టులో లోకేశ్ నిలదీశారు. ప్రతిపక్షం తీరును ఆయన 'సైకోయిజం'గా అభివర్ణించారు.

## మండుతున్న ఎండలు..

మొదటి పేజి తరువాయి

ఏప్రిల్ నుంచి జూన్ వరకు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయని, వేడిగాలులు అధికమవుతాయని ఈ సర్క్యులర్‌లో హెచ్చరించారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో మరో వారంపాటు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ వేసవిలో గరిష్ట ఉష్ణోగ్రతలు 4144 డిగ్రీల వరకు నమోదవుతాయని, సాధారణం కంటే 1.5 నుంచి 4.5 డిగ్రీలు పెరిగే అవకాశముందన్నారు. రాత్రుళ్లు కూడా వేడి తగ్గకపోవచ్చని, అందువల్ల వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, వ్యవసాయ, నిర్మాణ, శానిటరీ, రవాణా రంగాల కార్మికులు, పట్టణ ప్రాంతాల్లో నివసించే పేదలు, వన్యప్రాణులు, పశువుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలను కూడా వివరించారు.

ముఖ్యంగా ప్రార్థనా స్థలాలు, మాల్స్, బస్టాండులు, పబ్లిక్ భవనాల్లో కూలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయించాలని, ఎన్జీవోలు ఇతర సంస్థల ద్వారా చలివేంద్రాలను ప్రోత్సహించి వాటిలో మంచినీటితోపాటు మజ్జిగ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీల్లో ప్రాథమిక చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచాలని చెప్పారు. ఎండలు, వేడి గురించి ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యపరిచేందుకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా స్థాయి నోడల్ అధికారులను నియమించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, రోజూ జిల్లాల వారీ పరిస్థితులపై తమకు నివేదికలు పంపాలని పేర్కొన్నారు.

వడదెబ్బ బాధితులకు చికిత్స: మంత్రి రాజనర్సింహ

' రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ బాధితులకు తక్షణమే చికిత్స అందేలా ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో



ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన వేసవి పరిస్థితులపై విస్తృతంగా చర్చించారు. ఆసుపత్రుల్లో అవుట్‌పేషెంట్లు, ఇన్‌పేషెంట్లు, వారి సహాయకులకు తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఈ జాగ్రత్తలు ముఖ్యం..

' ప్రజలు ఎండల ప్రభావం నుంచి రక్షణ పొందేందుకు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య బయటకు వెళ్లకుండా ఉండాలని, తరచూ నీరు, ఓఆర్ఎస్, మజ్జిగ, నిమ్మరసం తీసుకోవాలన్నారు. తేలికపాటి దుస్తులు ధరించడం, తలకు కవర్ ఉపయోగించడం ద్వారా ఎండ తీవ్రతను తగ్గించుకోవచ్చని సూచించారు. వడదెబ్బ లక్షణాలపై కూడా వైద్యులు అప్రమత్తం చేస్తున్నారు. శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరగడం, తల తిరగడం, వాంతులు, మూర్ఛ, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలని ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది.

మండుతున్న ఎండలు.. తెలంగాణలో పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

తెలంగాణ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో నేడు, రేపు ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. రానున్న మూడు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేపి ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

ఎండాకాలంలో అప్రమత్తంగా.. ఈ జాగ్రత్తలు పాటించండి

మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిన జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం అవకాశం ఉందని పేర్కొంది.

### నారీశక్తి అనేది నినాదం కాదు

## మన నాగరికతకు బలం

మొదటి పేజి తరువాయి

పాలనలో వారికి సముచిత స్థానం దక్కుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా సాధికారతకు జనసేన పార్టీ మాటలతో కాకుండా చేతలతో ఎప్పుడూ మద్దతుగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్న పవన్ కల్యాణ్, “2019 ఎన్నికల్లో మేము వాగ్దానం చేసినట్లుగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల పట్ల మా నిబద్ధత, సమాన అవకాశాలు, సరైన ప్రాతినిధ్యంపై మాకున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది“ అని తెలిపారు. మహిళలు సమాజానికి పునాది అని, కుటుంబాలను తీర్చిదిద్దడం నుంచి దేశ నిర్మాణంలో పాలుపంచుకోవడం వరకు వారి పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. “మహిళ ఎదిగితే దేశం ఎదుగుతుంది. ఇది వారికి కొత్త హక్కులు ఇవ్వడం కాదు, వారికి న్యాయంగా చెందాల్సిన వాటిని తిరిగి ఇవ్వడం. బలమైన మహిళలు బలమైన కుటుంబాలను నిర్మిస్తారు. బలమైన కుటుంబాలు బలమైన దేశాన్ని నిర్మిస్తాయి. ఇకపై 'నారీ శక్తి' కేవలం నినాదం కాదు, మన నాగరికతకు బలంగా నిలుస్తుంది. న్యాయమైన, సమానమైన, సాధికారత కలిగిన భారతదేశాన్ని నిర్మించడానికి ఈ స్ఫూర్తితో ముందుకు సాగుదాం“ అని పవన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న భారత మహిళల విజయాలను ఆయన కొనియాడారు. సైప్రస్‌లో జరిగిన ఉమెన్స్ క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో గెలిచి, ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌కు సవాల్ చేసే హక్కును పొందిన తొలి భారతీయ మహిళగా ఆర్. వైశాలి చరిత్ర సృష్టించడాన్ని ప్రస్తావించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఇస్రో శాస్త్రవేత్త రీతూ కరిధాల్ నుంచి ఒలింపిక్స్‌లో పీవీ సింధు, మీరాబాయి చాను, బాక్సింగ్‌లో నిఖత్ జరీన్ వరకు ఎందరో మహిళలు దేశానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన దాక్షాయణి వేలాయుధన్, హంసా మెహతా, దుర్గాబాయి దేశ్‌ముఖ్, విజయలక్ష్మీ పండిట్, రాజకుమారి అమృత్ కౌర్ వంటి వారి సేవలను పవన్ గుర్తు చేసుకున్నారు. “ప్రతిభకు అవకాశం తోడైనప్పుడు, మహిళలు నాయకత్వం వహిస్తారు, రాణిస్తారు, దేశాలకు స్ఫూర్తిగా నిలుస్తారని ఈ విజయాలన్నీ నిరూపిస్తున్నాయి“ అని ఆయన పేర్కొన్నారు.

## రాష్ట్రంలో 56.36 శాతంతో బీసీలదే అగ్రస్థానం

తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేకు సంబంధించిన అధికారిక గణంకాలను విడుదల చేసింది. ఈ సర్వే ప్రకారం రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతులు (బీసీలు) 56.36 శాతంతో అతిపెద్ద సామాజిక వర్గంగా నిలిచారు. జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. దేశంలోనే ఆదర్శవంతంగా, అత్యంత పారదర్శకంగా ఈ సర్వే ప్రక్రియను పూర్తి చేశామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ భారీ కసరత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.03 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేశారు. ప్రజల నుంచి 'సెల్ఫ్ డిక్లరేషన్' పద్ధతిలో వివరాలను సేకరించారు. ఈ సర్వేలో భాగంగా మొత్తం 1,12,36,849 కుటుంబాలను సర్వే బృందాలు సందర్శించి, 3,55,50,759 మంది జనాభా వివరాలను నమోదు చేసినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపింది.

సామాజిక వర్గాల వారీగా జనాభా వాటా

సర్వే ఫలితాల ప్రకారం, రాష్ట్ర జనాభాలో బీసీల తర్వాత షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు) 17.42 శాతం, అగ్రవర్ణాలు (ఓసీలు) 15.79 శాతం, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) 10.43 శాతం చొప్పున ఉన్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సుమారు 4 శాతం మంది ప్రజలు తమకు ఎలాంటి కులం లేదని (చీశీ ఋుర్‌వ) తమ డిక్లరేషన్‌లో పేర్కొనడం గమనార్హం.

కులాల వారీగా ప్రధాన వర్గాలు

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కులాల జాబితాను పరిశీలిస్తే, 36.58 లక్షల మందితో (10.3 శాతం) మాదిగ సామాజిక వర్గం మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత 27.96 లక్షల మందితో (7.9 శాతం) షేక్ ముస్లింలు రెండో స్థానంలో, 26.39 లక్షల జనాభాతో (7.4 శాతం) ముదిరాజ్ సామాజిక వర్గం మూడో స్థానంలో ఉన్నాయి. ఓసీ వర్గాల్లో: రెడ్డి సామాజిక వర్గం 4.8 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో కోమటి (1.4 శాతం), కమ్మ (1.0 శాతం), బ్రాహ్మణ (0.9 శాతం), కాపు/నాయుడు (0.7 శాతం), వెలమ (0.4 శాతం) ఉన్నారు.

బీసీ వర్గాల్లో: షేక్ ముస్లింలు (7.9 శాతం) అత్యధిక జనాభాతో ముందుండగా, ముదిరాజ్ (7.4 శాతం), యాదవ (5.7 శాతం), గౌడ్ (4.6 శాతం), మున్నూరుకాపు (3.9 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచారు.

ఎస్సీ వర్గాల్లో: మాదిగ (10.3 శాతం) సామాజిక వర్గం అత్యధిక జనాభా కలిగి ఉండగా, మాల (4.1 శాతం), బేడా (0.5 శాతం), మాల సేల్ (0.5 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

ఎస్టీ వర్గాల్లో: లంబాడీలు 6.8 శాతం జనాభాతో అగ్రస్థానంలో నిలిచారు. కోయ (1.2 శాతం), గోండ్ (1.1 శాతం), ఎరుకుల (0.5 శాతం) వారి తర్వాత ఉన్నారు.

ఈ సర్వే ద్వారా వెల్లడైన గణంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల రూపకల్పన, రాజకీయ సమీకరణాల్లో కీలక పాత్ర పోషించనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

### మహిళా బిల్లుతో దేశ రాజకీయాల

## దిశ, దశ మారతాయి

మొదటి పేజి తరువాయి

దేశానికి కొత్త దిశానిర్దేశం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కీలక బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్... రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026, డీలిమిటేషన్ బిల్లు, 2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026లను సభ ముందు ఉంచారు. అయితే, ఈ బిల్లును ప్రవేశపెట్టే సమయంలో విపక్షాలు మూజువాణి ఓటింగ్‌ను అంగీకరించలేదు. ఓట్ల విభజన (డివిజన్)కు పట్టుబట్టడంతో సభలో ఓటింగ్ నిర్వహించాల్సి వచ్చింది. బిల్లు ప్రవేశపెట్టడానికి అనుకూలంగా 251 ఓట్లు, వ్యతిరేకంగా 185 ఓట్లు పోలైనట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సాధారణంగా లోక్‌సభలో మూజువాణి ఓటు ద్వారానే తీర్మానాలు ఆమోదిస్తారు. కానీ, ఫలితంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పుడు సభ్యుల కోరిక మేరకు డివిజన్ నిర్వహిస్తారు. ఆటోమేటిక్ ఓట్ రికార్డర్ వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను పూర్తిచేశారు. ఆ తర్వాత ఓటు స్లిప్పుల ద్వారా జరిగిన ఓటింగ్‌లో మొత్తం 333 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, పార్టీలు ఈ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని విజ్ఞప్తి చేశారు. వికసిత భారత్ ఏ2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో మహిళా రిజర్వేషన్లు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. గతంలో ఈ బిల్లును వ్యతిరేకించిన వారికి మహిళా ఓటర్లు తగిన గుణపాఠం చెప్పారని ఆయన వ్యాఖ్యానించారు.

## మహిళా బిల్లుపై పార్లమెంట్ లో చర్చ..

మహిళల కు కేటాయించిన 33శాతం రిజర్వేషన్లలో వెనుకబడిన వర్గాలు (ఓబీసీ), ముస్లిం మహిళలకు ప్రత్యేకంగా ఉప-కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. అప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అఖిలేశ్ డిమాండ్‌పై అమిత్ షా తీవ్రంగా స్పందించారు. భారత రాజ్యాంగం ప్రకారం మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడం అసాధ్యమని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే విపక్షాలు ఇలాంటి డిమాండ్లు చేస్తున్నాయని విమర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి ఇది పూర్తిగా విరుద్ధమని ప్రభుత్వం తరఫున ఆయన గట్టిగా వాదించారు. ఈ బిల్లును వెంటనే అమలు చేయకుండా జనాభా గణన (సెన్సస్), నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే అమలు చేస్తామని చెప్పడంపైనా విపక్షాలు అభ్యంతరం తెలిపాయి. ప్రభుత్వం కావాలనే కాలయాపన చేస్తోందని అఖిలేశ్ యాదవ్‌తో పాటు ఇతర ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం కాగా, ఓబీసీ, ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా లేకపోవడమే ప్రస్తుత వివాదానికి కేంద్ర బిందువుగా మారింది.

## కాకినాడ సెజ్‌కు మరో భారీ పరిశ్రమ.. రూ.700 కోట్ల పెట్టుబడితో ప్లాంట్

అమరావతి: ఏపీలో పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కొత్త పరిశ్రమలను నెలకొల్పే దిశగా చేపడుతున్న చర్యలు ఫలిస్తున్నాయి. తాజాగా కాకినాడ స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్) పరిధిలో మరో భారీ పరిశ్రమ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. చెన్నైకి చెందిన గ్రీన్ కోక్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.700 కోట్ల పెట్టుబడితో ఇక్కడ పరిశ్రమను స్థాపించనుంది. ఈ మేరకు గ్రీన్ కోక్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, కాకినాడ సెజ్ లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. గ్రీన్ కోక్ ఎనర్జీ ఎండీ నటరాజన్, సెజ్ ఎండీ, సీఈవో రామ్‌రెడ్డి ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ పరిశ్రమ ద్వారా స్టీల్ ఉత్పత్తిలో కీలకమైన మెటలర్జికల్ కోక్‌ను తయారు చేస్తారు. కాకినాడ సెజ్‌లోని ఏవీ నగరం సమీపంలో సుమారు 80 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో దాదాపు వెయ్యి మందికి ప్రత్యక్షంగా, మరో వెయ్యి మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తద్వారా కాకినాడ జిల్లాలోని తొండంగి, ఉప్పాడ మండలాల పరిధిలో పారిశ్రామిక కార్యకలాపాలు మరింత విస్తరించనున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షించడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెలిసిందే. ఇటీవలే అనకాపల్లి జిల్లాలో మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయడం దీనికి నిదర్శనం. ఇప్పుడు కాకినాడ సెజ్‌లో మరో కీలక పరిశ్రమ రావడం పారిశ్రామిక ప్రగతికి ఊతమిస్తోంది. ఇప్పటికే కాకినాడ సెజ్‌లో అరబిందో ఫార్మాకు చెందిన లైఫియస్, క్యూలే, పోర్టు పరిశ్రమలు ఉన్నాయి. ఇటీవలే ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా రూ.2,500 కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన లైఫియస్ ఫార్మా పరిశ్రమ ప్రారంభమైంది. ఇప్పుడు గ్రీన్ కోక్ ఎనర్జీ రాకతో ఈ ప్రాంతం పారిశ్రామిక హబ్‌గా మరింత అభివృద్ధి చెందనుంది. సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన ప్రోత్సాహకాలను అందిస్తూ, మరిన్ని కంపెనీలను ఆకర్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. త్వరలోనే మరిన్ని పరిశ్రమలు రాష్ట్రానికి రానున్నాయని ప్రభుత్వ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి.

## పిఠాపురానికి 'సెలక్షన్ గ్రేడ్' హోదా..

### పవన్ చొరవతో కీలక నిర్ణయం

అమరావతి: డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పిఠాపురం మున్సిపాలిటీని సెకండ్ గ్రేడ్ నుంచి సెలక్షన్ గ్రేడ్‌కు పెంచుతూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ హోదా పెంపుతో పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన మరింత వేగవంతం కానుంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపినట్లు తెలుస్తోంది. పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్, ప్రత్యేక అధికారి పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలించింది. 2021 నుంచి 2025 వరకు మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాల రికార్డులను సమీక్షించిన అనంతరం, సెలక్షన్ గ్రేడ్‌కు అర్హత ఉందని నిర్ధారించి ఈ నిర్ణయం తీసుకుంది. సాధారణంగా రూ.8 కోట్లకు పైగా వార్షిక ఆదాయం ఉన్న మున్సిపాలిటీలకు సెలక్షన్ గ్రేడ్ హోదా కల్పిస్తారు.

### డీలిమిటేషన్ తో నష్టం ఉండదు...

## మీకు బ్లాంక్ చెక్ ఇస్తున్నా: లోక్ సభలో ప్రధాని మోదీ

ఢిల్లీ: మహిళా రిజర్వేషన్ల అమలుకు ముందు చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) విషయంలో ఎలాంటి వివక్షకు, అన్యాయానికి తావుండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ విషయంలో తాను “గ్యారెంటీ“, “ప్రామిస్“ వంటి పదాలను ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్నానని, ఉత్తర, దక్షిణ రాష్ట్రాలనే తేడా లేకుండా ఈ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని ఆయన భరోసా ఇచ్చారు. లోక్‌సభలో 'రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026'పై జరిగిన చర్చలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయాలకు అతీతంగా చూడాలని పిలుపునిచ్చారు. “ఈ బిల్లు ఘనతను మీరే తీసుకోండి. మీకు నచ్చిన వారి ఫొటోలతో నేను ప్రకటనలు ఇవ్వడానికైనా సిద్ధం. ఈ విషయంలో మీకు 'బ్లాంక్ చెక్' ఇస్తున్నా“ అని విపక్షాలను ఉద్దేశించి అన్నారు. ఈ బిల్లు దేశ రాజకీయాల దిశ, దశను మార్చే శక్తిమంతమైనదని ప్రధాని అభిప్రాయపడ్డారు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలు విధాన నిర్ణయాల్లో పాలుపంచుకోవడం ద్వారా 'వికసిత్ భారత్ ఏ2047' లక్ష్యాన్ని చేరుకోవడం సులభమవుతుందని పేర్కొన్నారు. 2023లోనే 'నారీ శక్తి వందన్ అధినియం'ను ఏకాభిప్రాయంతో ఆమోదించామని గుర్తుచేశారు. “2029 నాటికి మహిళా కోటాను అమలు చేయడంలో విఫలమైతే, మన చిత్తశుద్ధిని మహిళలు నమ్మరు. దశాబ్దాలుగా వారికి నిరాకరించిన హక్కులను అందించే గొప్ప అవకాశం ఇప్పుడు మనకు లభించింది“ అని మోదీ అన్నారు. గ్రామ పంచాయతీల నుంచి పట్టణ స్థానిక సంస్థల వరకు ఇప్పటికే వేల సంఖ్యలో మహిళలు నాయకత్వ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని, ఇప్పుడు వారిని జాతీయ స్థాయిలో విధాన నిర్ణయాల్లో భాగస్వాములను చేయాల్సిన సమయం వచ్చిందని ప్రధాని తెలిపారు. అంతకుముందు, ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టడాన్ని లోక్‌సభ ఆమోదించింది. విపక్షాలు రికార్డెడ్ ఓటింగ్ కోసం పట్టుబట్టడంతో, డివిజన్ ప్రక్రియ ద్వారా దీనికి ఆమోదం లభించింది.

## రేవంత్ రెడ్డి వాదన విని తెలంగాణ ప్రజలు నవ్వుతున్నారు

ఢిల్లీ: డీలిమిటేషన్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వితండవాదం చేస్తున్నారని, ఆయన చెబుతున్నది విని తెలంగాణ ప్రజలు కూడా నవ్వుతున్నారని బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య అన్నారు. రాష్ట్రాల జీఎస్‌డీపీ ఆధారంగా లోక్ సభ సీట్ల సంఖ్యను పెంచాలన్న రేవంత్ రెడ్డి ప్రతిపాదనపై ఆయన మండిపడ్డారు. సీట్ల పెంపునకు, జీఎస్‌డీపీ ముడిపెట్టాలన్న తెలంగాణ సీఎం సలహా అత్యంత మూర్ఖంగా ఉందని అన్నారు. అసలు ఆయనకు ఆ సలహా ఎవరిచ్చారో కానీ అందరూ నవ్వుతున్నారని చురక అంటించారు. లోక్ సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న విపక్ష పార్టీలు, దక్షిణాది పార్టీల వ్యాఖ్యలను సూర్య తప్పుబట్టారు. డీలిమిటేషన్‌పై విపక్షాల వాదన అర్థరహితంగా ఉందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. డీలిమిటేషన్‌పై ప్రతిపక్షాలు దక్షిణాది రాష్ట్రాల ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాల ఆదాయం అనేది ప్రతి సంవత్సరం మారుతుందని తెలిపారు. దానిని డీలిమిటేషన్‌కు ప్రాతిపదికగా తీసుకోవాలని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. ఆదాయం ప్రకారం ఓట్లు లేదా ప్రాతినిధ్యం ఇవ్వాలనుకుంటే దేశంలో అత్యధిక ఆదాయం ఉన్న అంబానీకి లక్ష ఓట్లు ఇవ్వవలసి వస్తుందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వాలు మహిళా రిజర్వేషన్ బిల్లును పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పుడు కూడా మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడానికే చూస్తున్నాయని అన్నారు. డీలిమిటేషన్‌ను సాకుగా చూపి మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వేగంగా అమలు చేద్దామంటే విపక్షాలు యూటర్న్ తీసుకుంటున్నాయని అన్నారు.

## చెవిరెడ్డి కుటుంబ అవినీతి మట్నత్తాన్నీ త్వరలో బయటపెడతాం.. పులివర్తి నాని వార్నింగ్

తుడా అవినీతి కేసులో వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మరోసారి జైలుకెళ్తారని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. చెవిరెడ్డి కుటుంబానికి సహకరించిన అధికారులంతా వారం రోజుల్లో సస్పెండ్ అవుతారని తెలిపారు. దొంగ ఓట్లను చేర్పించిన వ్యవహారంలో చెవిరెడ్డికి శిక్ష తప్పదని హెచ్చరించారు. తిరుపతిలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో పులివర్తి నాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయ విలువల్లేని వ్యక్తి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అని విమర్శలు చేశారు. తండ్రిని అడ్డం పెట్టుకుని కోట్లు సంపాదించారని ఆరోపించారు.చెవిరెడ్డి కుటుంబ అవినీతి మట్నత్తాన్నీ త్వరలోనే బయటపెడతానని పులివర్తి నాని హెచ్చరించారు.

యువతరం న్యూస్ The Voice of youth

శనివారం 18-04-2026

## నీటి భద్రత, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా జలధార జలహారతి" కార్యక్రమం నిర్వహణ

**కర్నూలు జిల్లాలో 479 గ్రామాల్లో 3435 పనుల గుర్తింపు.**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**



కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 17 యువతరం న్యూస్ :నీటి భద్రత, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జలధార-- జలహారతి" కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో జలధార - జలహారతి కార్యక్రమ నిర్వహణ పై ఇరిగేషన్ ఎస్ఈ, డ్వామా పిడితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని 479 గ్రామ పంచాయతీలలో ఇప్పటివరకు 3435 పనులను గుర్తించినట్లు వెల్లడించారు. గ్రామాల్లో ఉన్న పాత చెరువులు, కుంటలు, వాటికి అనుసంధానమైన కాలువలు, వంకలు తదితర జల వనరులను పూడికతీత చేయడం, జంగిల్ క్లియరెన్స్ నిర్వహించడం ద్వారా నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించడం వంటి పనులను గుర్తించి చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ చర్యల ద్వారా వర్షపు నీరు వృథా కాకుండా చెరువుల్లో నిల్వచేసి, భూగర్భ జలాలను పెంపొందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. మొత్తం గుర్తించిన పనుల్లో ఎం.ఐ. ట్యాంకులకు సంబంధించిన పనులు 380 కాగా, మిగిలిన పనులు నీటి సంరక్షణ పనులని తెలిపారు. గ్రామసభలు నిర్వహించి, ముఖ్యంగా గ్రామ పెద్దలు, స్థానిక ప్రజల అభిప్రాయాల మేరకు పనులను గుర్తించి, పనులు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో వర్షాలు, వరదలు వచ్చినప్పుడు నీటి ప్రవాహ దిశలు, నీరు ఎక్కువగా చేరే ప్రాంతాలు వంటి విషయాల్లో గ్రామ పెద్దలకు ఉన్న అనుభవాన్ని వినియోగించుకుంటూ, వారి సమ్మతితో ప్రణాళికలు అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సంవత్సరం వర్షాకాలానికి ముందే అన్ని పనులను పూర్తి చేసి చెరువులు, కుంటలు నీటితో నింపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణ లో వీబీ రామ్ జీ పథకాన్ని అనుసంధానం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.. ప్రస్తుతం జిల్లాలో భూగర్భ జలాల స్థాయి సగటుగా 6.6 మీటర్ల లోతులో ఉండగా, దానిని 3.00 మీటర్ల వరకు పెంచే లక్ష్యంగా పనులను చేపట్టాలన్నారు. సంబంధిత శాఖల అధికారులందరూ చురుగ్గా పనిచేసి ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జల వనరుల శాఖ ఎస్ ఈ బాల చంద్రా రెడ్డి, డ్వామా పిడి నరసింహా రెడ్డి పాల్గొన్నారు.

## పన్ను చెల్లింపు దారులు సక్రమంగా జీఎస్టీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలి

**జిల్లాలో ఉన్న ప్రతి పరిశ్రమకు జీఎస్టీ రిజిస్ట్రేషన్ ఉండాలి.**

**జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**





కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 17 యువతరం న్యూస్ :పన్ను చెల్లింపు దారులు సక్రమంగా జీఎస్టీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడ జాప్యం లేకుండా పన్నుల వసూళ్ల ప్రక్రియ కొనసాగాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులతో జీఎస్టీ కో ఆర్డినేషన్ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయ మార్గాలను మెరుగుపరచడంతో పాటు పన్ను వసూళ్లలో పారదర్శకతను పెంచాలన్నారు. ఎన్ఐసీడీసీ (నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ కార్పొరేషన్) ఓర్వకల్ నోడ్ లో భాగంగా ఉందని, దీనికి సంబంధించిన కాంట్రాక్టర్ లకు జీఎస్టీ రిజిస్ట్రేషన్ ఉందో లేదో వెరిఫై చేయాలని, అదే విధంగా జిల్లాలో ఉన్న పరిశ్రమలు జీఎస్టీ రిజిస్ట్రేషన్ తీసుకుంటున్నారో ? లేదో ? వెరిఫై చేయాలని కలెక్టర్ కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ ను ఆదేశించారు. నెడ్ క్యాప్ ద్వారా ఏర్పాటు అవ్వనున్న పవర్ కంపెనీల వివరాలు తీసుకొని జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రిజిస్ట్రేషన్ ఫీజులు, పన్నులు సక్రమంగా కడుతున్నారా లేదా వెరిఫై చేసి పన్ను ఎగవేత జరగకుండా చూడాలన్నారు. అరియర్స్ దాదాపు రూ.190 కోట్ల వరకు పెండింగ్ లో ఉన్నాయని వాటిని త్వరితగతిన కలెక్ట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా జీఎస్టీ రిజిస్ట్రేషన్లు తీసుకునే సమయంలో ఒక బ్యాంక్ అకౌంట్ ఖాతా మాత్రమే ఇస్తారని, వారికి ఆ పాన్ నంబర్ కింద ఇతర బ్యాంక్ లో కూడా ఖాతాలు ఉండే అవకాశం ఉంటుందని, సంబంధిత పాన్ నంబర్ లను జీఎస్టీ వారితో కో ఆర్డినేట్ చేసుకొని సంబంధిత పాన్ నంబర్ కింద ఉండే బ్యాంక్ అకౌంట్ వివరాలను ఇవ్వాలని కలెక్టర్ ఎల్ డి ఎమ్ సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 38 ప్రాజెక్ట్ లకు ఎం ఓ యు చేసుకోవడం జరిగిందని, వాటిలో ఇప్పటికే 24 ప్రాజెక్ట్ లకు జీవోలు జారీ అయ్యాయన్నారు. ఇప్పటికే 35 మంది ప్రతినిధులు స్థలాలను సందర్శించి,10 ప్రాజెక్టులకు పునాది రాళ్లు వేశారన్నారు. మిగిలిన అగస్త్య, సిగాచి, ఎలిఫ్ తదితర పరిశ్రమలు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు. సంబంధిత వివరాలు అన్ని కూడా ఏపీఐఐసి వారితో కో ఆర్డినేట్ చేసుకొని జీఎస్టీ రిజిస్ట్రేషన్ ఉందో లేదో వెరిఫై చేయాలన్నారు. కన్స్ట్రక్షన్ యాక్టివిటీ లో భాగంగా ఆర్ అండ్ బి , పంచాయతీ రాజ్, ఏపీఎంఎస్ఐడీసీ , నేషనల్ హైవే కింద పని చేసే కాంట్రాక్టర్లు, ప్రభుత్వ హాస్పిటల్స్ లో ఉన్న ఏజెన్సీలు, మున్సిపాలిటీలో ఉన్న ఏజెన్సీల కింద మొత్తం పనులు మరియు ప్రాజెక్టులు వివరాలు, జిఎస్టి నెంబర్ ఉన్నవారు ఎంతమంది, జిఎస్టి లేనివారు ఎంతమంది, మొత్తం ఎంతమంది కాంట్రాక్టర్లు ఉన్నారు అనే వివరాలు కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ కి ఇవ్వాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్లు (డి డి ఓ స్ ) అందరూ జిఎస్టి టీడీస్ కింద రిజిస్టర్ అవ్వాలని, కాంట్రాక్టర్లు జిఎస్టి పే చేస్తున్నారో లేదో పర్యవేక్షించాలన్నారు. ఇందుకు సంబంధించి డి డి ఓ లకు శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ నీరజ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో మన జిల్లా 11% వృద్ధిని నమోదు చేసి 5వ స్థానంలో ఉందన్నారు. గత ఏడాది మనం రూ.778 కోట్ల లక్ష్యాన్ని పెట్టుకోగా, 85% సాధించామన్నారు. జిఎస్టి సంస్కరణలు మరియు రేట్ల తగ్గింపు ఉన్నప్పటికీ, కర్నూలు జిల్లా ఇతర జిల్లాల కంటే మెరుగ్గా రాణించిందన్నారు. సమావేశంలో ఇంచార్జి డిఆర్ఓ చిరంజీవి, అదనపు మున్సిపల్ కమిషనర్ కృష్ణ, డి టీ సీ శాంత కుమారి, పరిశ్రమల శాఖ జీఎం అశోక్ కుమార్, డి ఎస్ ఓ రాజా రఘువీర్, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గుడిసె అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



పెద్దకడబూరు ఏప్రిల్ 17 (యువతరం న్యూస్ (ప్రతినిధి) : పెద్దకడబూరు మండలం లక్ష్మీపేటలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో గుడిసె కాలిపోయి జెల్లి చిన్న ఆంజనేయ కుటుంబీకులు నిరాశ్రయులుగా మారారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి స్పందించి శుక్రవారం బాధితులతో ఫోన్లో పరామర్శించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, చంద్రారెడ్డి, శివారెడ్డి, విజేంద్ర రెడ్డి బాధిత కుటుంబానికి శుక్రవారం ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గుడిసె అగ్ని ప్రమాద బాధితులకు భరోసా

**నిత్యవసర సరుకులు, పదివేల రూపాయలు ఆర్థిక సహాయం**

**బాధితులకు ఆర్థిక సహాయం చేసిన ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి**





పెద్దకడబూరు ఏప్రిల్ 17 (యువతరం న్యూస్ (ప్రతినిధి) : మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామంలో బీసీ కాలనీలోని లక్ష్మీపేటలో గురువారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. స్థానిక జెల్లి చిన్న ఆంజనయ్య కు చెందిన గుడిసెలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా మంటల్లో పూర్తిగా కాలిపోయింది. ఇంట్లోని నిత్యవసర సరుకులు పనురకాల వస్తువులు సుమారు లక్ష యాభై వేల రూపాయలు విలువ చేసే బట్టలు మంటల్లో ఖాళీ బుగ్గిపాలయ్యాయని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రాలయం టిడిపి ఇన్చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి బాధితులను శుక్రవారం ఫోన్లో పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం బాధితులకు నిత్యవసర సరుకులు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మెట్రు రామాంజనేయులు, తలారి అంజి, ఈరన్న, సొసైటీ చైర్మన్ మీసేవ ఆంజనేయులు, దిడ్డికాటి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబంలో మెరిసిన ఆణిముత్యం...

**సాకే భావనకు అభినందనలు తెలిపిన...**

**మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్....**



బుక్కరాయసముద్రం ఏప్రిల్ 17 యువతరం న్యూస్ :-బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న సాకే పద్మావతి, సాకే అంజనేయులు కుమార్తె సాకే భావన ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంలో తన ప్రతిభతో అందరి ప్రశంసలు అందుకుంది. పేద కుటుంబంలో జన్మించినప్పటికీ కష్టాలను జయిస్తూ విద్యలో మెరిసిన భావన గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ గారు భావనను అభినందిస్తూ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశీర్వదించారు. ఆమె సాధించిన విజయంపై గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. పేదరికం ప్రతిభకు అడ్డుకాదని నిరూపించిన భావన మరెంతో మందికి ఆదర్శంగా నిలుస్తోందని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్ పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శులు. నీలం భాస్కర్,సాకే రామాంజనేయులు,ఎస్సీ సెల్ నాయకులు మంత్రి ఆంజనేయులు,ప్రభుదాస్, మల్లెపోగుల నాగేష్,ఖాదర్ పేట నాగేంద్ర, సాకే ఆంజనేయులు చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ముంగిటికే పాలన: ఎమ్మెల్యే కోళ్ల



విజయనగరం ప్రతినిది ఏప్రిల్ 17 యువతరం న్యూస్:ప్రజల ముంగిటికే పాలన తీసుకెళ్లేందుకు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు.వేపాడ మండలం పాటూరులో శుక్రవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ నిర్వహించారు.

**మొత్తం 180 వినతులు అందాయి.**
**పింఛన్లు 109**

గృహ నిర్మాణం కోసం -38 రెవెన్యూ సమస్యలపై-31
వినతులు పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## ప్రతీ ఇంటినుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలి: విజయనగరం కలెక్టర్




విజయనగరం ప్రతినిది ఏప్రిల్ 17 యువతరం న్యూస్: ప్రతీ ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలని విజయనగరం కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మహారాజా కోటలో శుక్రవారం ప్రారంభమైన 2 రోజుల 'వెండార్ డెవలప్మెంట్' కార్యక్రమం. ఇది 'లఘు ఉద్యోగ్ భారత్'లో భాగం. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కొత్తవలస: ప్రమాదాల నివారణకు స్టాపర్లు ఏర్పాటు




విజయనగరం ప్రతినిది ఏప్రిల్ 17 యువతరం న్యూస్: రోడ్డు ప్రమాదాల నివారణకు కొత్తవలస మండలంలో స్టాపర్లు, రేడియం స్టిక్కర్ అంటించిన టైర్లు ఏర్పాటు చేసినట్లు సీఐ షణ్ముఖరావు తెలిపారు.ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు కొత్తవలస మండలంలో యాక్సిడెంట్ ప్రదేశాలను గుర్తించి స్టాపర్లు ఏర్పాటు చేశామన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాలు అరికట్టడంలో వాహనదారులు సహకరించాలని కోరారు.

## రీ సర్వే తోనే భూసమస్యలు పరిష్కారం



కొత్తపల్లి, ఏప్రిల్ 17 యువతరం న్యూస్ :రీ సర్వే తోనే భూ సమస్యలు పరిష్కారం అవుతాయని కొత్తపల్లి తాసిల్దార్ ఉమారాణి కోరారు. ఆమె శుక్రవారం మండల పరిధిలోని సిద్దేశ్వరం, పాత మాదుగుల గ్రామంలో రే సర్వే డిప్యూటీ తాసిల్దార్ పెద్దన్న ఆధ్వర్యంలో ర్యాలీ, గ్రామసభ నిర్వహించి రే సర్వే పనులు ప్రారంభించారు . అనంతరం ఆమె మాట్లాడుతూ సమగ్ర సర్వే తోనే భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, అధికారులు జారీ చేసే సర్వే నోటీసులను స్వీకరించి, సూచించిన సమయానికి క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి.సర్వే సిబ్బంది వచ్చినప్పుడు మీ భూమి వద్ద ఉండి, పొరుగు రైతుల సమక్షంలో హద్దులను సరిచూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వేణుగోపాల్ సర్వేర్ వెంకటేష్ గ్రామ నాయకులు లింగన్న చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి



కొత్తపల్లి ఏప్రిల్ 17 యువతరం న్యూస్ :ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామి విద్యార్థుల తల్లిదండ్రులకు కోరారు . ఆయన శుక్రవారం మండల పరిధిలోని గోకవరం,ఎం లింగాపురం గ్రామాలలో బడి పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.ఐదవ తరగతి పూర్తయిన విద్యార్థుల ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నారు.ప్రభుత్వ బడుల్లో కల్పిస్తున్న వసతులు, నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం వంటి ప్రయోజనాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సచివాల సిబ్బంది సమయపాలన పాటించాలి







కొత్తపల్లి ఏప్రిల్ 17 యువతరం న్యూస్ :సచివాల సిబ్బంది సమయపాలన పాటించాలని సచివాలయ డిప్యూటీ ఎంపీడీవో కేపీఆర్ శర్మ అన్నారు. ఆయన శుక్రవారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల స్వర్ణ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఇతనికీలో పలు రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాల సిబ్బంది సమయపాలన పాటించాలని, సిబ్బంది రెండుపూటల బయోమెట్రిక్ ను వెయ్యాలన్నారు. పెండింగ్ లో ఉన్న సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అధికారులు తనకి సమయంలో సచివాలయ సిబ్బంది అన్ని రకాల దస్త్రాలను చూపించాలన్నారు. సమయపాలన పాటించని సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్ట్స్ & సాంస్కృతిక పోటీల్లో దివ్యాంగ విద్యార్థుల ప్రతిభ

**విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేసిన ఎంఈఓ ఉస్మాన్ భాష**



పెద్దకడబూరు ఏప్రిల్ 17 (యువతరం న్యూస్ ప్రతినిధి) : కర్నూలులోని హార్ట్ అండ్ ఫౌండేషన్ సెంటర్లో నిర్వహించిన ఆర్ట్స్, సాంస్కృతిక పోటీల్లో పెద్దకడబూరు భవిత సెంటర్ విద్యార్థులు ప్రతిభ చాటారు. డాన్స్ విభాగంలో వడ్డే ఉమ, డ్రాయింగ్ విభాగంలో ముద్గల్ జశ్వంత్ ద్వితీయ బహుమతులు సాధించారు. శుక్రవారం విజేతలకు ఎంఈవో ఉస్మాన్ భాష చేతుల మీదుగా మెడల్స్ అలాగే ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక రంగాల్లోనూ రాణించడం సంతోషించదగ్గ విషయమన్నారు. అనంతరం వారిని అభినందించారు. ఎంఈఓ ఉస్మాన్ భాష మాట్లాడుతూ రాబోవు రోజుల్లో మరిన్ని క్రీడా పోటీల్లో పాల్గొని విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం ఆర్ సి సిబ్బంది సురేశ్ రెడ్డి, లక్ష్మన్న, గోపాల్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## క్రీడా సాంస్కృతిక వారోత్సవ విజేతలకు బహుమతులు అందజేత

**మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి**

**ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి వెల్లడి**




పెద్దకడబూరు ఏప్రిల్ 17 (యువతరం న్యూస్ ప్రతినిధి) : మండల కేంద్రమైన పెద్దకడబురు గ్రామంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో నిర్వహించిన క్రీడా, సాంస్కృతి వారోత్సవ విజేతలకు శుక్రవారం బహుమతుల ప్రధాన ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమా మహేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి జరుగుతుందని విద్యార్థులకు అకాడమిక్ అంశాలతో పాటు సహ పాఠ్యాంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, అలాగే విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారని తెలియజేశారు. క్రీడలు అలాగే సాంస్కృతిక అంశాలు విద్యార్థులకు కుతూహలం తో పాటు ఆసక్తిగా పాల్గొంటారని విద్యార్థులు సాంస్కృతిక,క్రీడలలో పాల్గొనడం వల్ల చురుకుదనం అలాగే క్రీడా స్ఫూర్తి తో పాటు సమిష్టితత్వం మొదలగు అంశాలలో అభివృద్ధి సాధిస్తారని, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి తల్లిదండ్రులు అలాగే గ్రామ పెద్దలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గతంలో నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీల విజేతలకు ప్రధానోపాధ్యాయురాలు అలాగే ఉపాధ్యాయిని,ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు అలాగే ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

Yuvatharam News
యువతరం న్యూస్
The Voice of youth
శనివారం 18-04-2026

# విద్యార్థులు అన్ని రంగాలలో సర్వతోముఖాభివృద్ధి సాధించాలి.ఎంఈఓ బి.మస్తాన్ నాయక్




పెద్ద దోర్నాల, ఏప్రిల్17, యువతరం న్యూస్:దోర్నాల మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశా(బీసీ కాలనీ) అయినముక్కల గ్రామంలో ప్రధానోపాధ్యాయులు ఎన్.కాశయ్య అధ్యక్షతన పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు బి.మస్తాన్ నాయక్,ఎం. కొండలరావు పాల్గొన్నారు.ఈ సమావేశంలో విద్యశాఖ అధికారి బి.మస్తాన్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో విజయం సాధించాలని,ఆడుతూ పాడుతూ చదువుతూ ఉల్లాసంగా బాల్య జీవితం గడపాలని, భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగాలని తెలియజేశారు.విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఐదవ తరగతి నుండి ఆరవ తరగతికి వెళ్ళు విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మందగిరి వర్ధన్,కాసా చిన్న సుబ్బారెడ్డి, కోటేశ్వరరావు,విశాల,కోటేశ్వరి బాయ్, తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి రహిత పంచాయితీగా తీర్చిదిద్దాలి






ములుగు ప్రతినిధి ఏప్రిల్ 17 యువతరం న్యూస్ : శుక్రవారం పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డిప్యూటీ డిఎంహెచ్వో, డాక్టర్ క్రాంతి కుమార్ సమక్షంలో చంద్రుపట్ల గ్రామంలో క్షయ వ్యాధి లక్షణాలున్న 20 మంది అనుమానుతుల దగ్గర నుంచి నమూనాలు సేకరించారు, ఈ సందర్భంగా డిప్యూటీ డి ఎం హెచ్ ఓ మాట్లాడుతూ,, క్షయ వ్యాధి రహిత పంచాయితీగా చంద్రు పట్ల పంచాయతీ ఉండాలని రెండు వారాలకు మించి దగ్గు ఛాతీ లో నొప్పి బరువుతగ్గిపోవడం ఆకలి మందగించడం రోజు సాయంత్రం పూట జ్వరం రావడం పై లక్షణాలున్న ప్రతి ఒక్కరూ నమూనాలు ఇవ్వాలని తెలియజేశారు, ఏ జి హెచ్ ఎస్ పెద్ద గొల్లగూడెం నందు జరుగుతున్న హెచ్ పి వి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు, హెచ్ పి వి టీకా యొక్క ప్రాముఖ్యత గురించి గర్భాశయం ఒక ద్వారా క్యాన్సర్ రాకుండా ఉండడం తో పాటు ఇతర క్యాన్సర్లు కూడా ఈ టీకా వల్ల నివారించవలెను వచ్చానే తెలియజేశారు, 14 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు ఈ టీకా వేసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో బి వై డి ఎం హెచ్ ఓ డాక్టర్ కాంత్ కుమార్, డాక్టర్ తరుణ్ హెచ్ ఈ ఓ వేణుగోపాలకృష్ణ, ఐటీడీఏ ఎన్హెచ్ఎం ఏపీవో మహేందర్ , చంద్రు పట్ల పంచాయతీ సర్పంచ్ సంధ్యారాణి , పంచాయతీ కార్యదర్శి శృతి , ఏ జి హెచ్ ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు, బుచ్చిబాబు , రోజా , ఆరోగ్య కార్యకర్తలు, మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేరూరు ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డి ఎం హెచ్ ఓ గోపాల్ రావు





ములుగు ప్రతినిధి ఏప్రిల్ 17 యువతరం న్యూస్ : ములుగుజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయకర్త ( డిసిహెచ్ఎస్) డాక్టర్ జగదీష్ కిడ్నీ డయాలసిస్ సెంటర్ నిర్వహించుటకు అనువైన స్థలము ఉందా లేదా పరిశీలించుటకు ఆకస్మికంగా పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని తనిఖీ చేశారు, ఆరోగ్య కేంద్రంలోని అన్ని కార్యక్రమాలు ఏ విధంగా అమలవుతున్నాయి పర్యవేక్షించారు, 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలు తీరుని కార్యక్రమాలు సరిగా జరుగుతున్నాయా లేదా తగు సూచనలు సలహాలు తెలియజేయడం జరిగినది, ఈ కార్యక్రమంలో డి ఎం హెచ్ ఓ డాక్టర్ గోపాల్ రావు, డి సి హెచ్ ఎస్ డాక్టర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# 7మంది ఐపీయల్ బెట్టింగ్ రాయుళ్ళు అరెస్ట్ రూ.1,05,000,స్వాదినం చేసుకున్న పోలీసులు




అమడగూరు, ఏప్రిల్ 17,( యువతరం న్యూస్) : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నల్లమాడ సర్కల్ ఇన్స్పెక్టర్ వి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమడగూరు పోలీస్ స్టేషన్ సబ్-ఇన్స్పెక్టర్ గోపాల కృష్ణ కి వచ్చిన సమాచారంతో శుక్రవారం గుజరాత్ టైటన్స్ మరియు కొలకత్తా నైట్ రైడర్స్ మధ్య జరుగుతున్న ఐపీఎల్ -టి20 క్రికెట్ మ్యాచ్ సందర్భంగా మండలంలోని మహమ్మదాబాద్ గ్రామ పరిధిలో క్రికెట్ బెట్టింగ్ స్థావరంపై సబ్-ఇన్స్పెక్టర్ యు.గోపాల కృష్ణ మరియు పోలీస్ సిబ్బందితో కలిసి దాడి చేసి బెట్టింగ్ నిర్వహిస్తున్న మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన కె.మంజునాథ్ మరియు బెట్టింగ్ ఆడుతున్న కమ్మల విశ్వనాథ్, కొమ్ము సంపత్ కుమార్, పొగాకు జిలాన్ బాషా, మరుంపల్లి ఆదినారాయణ, పొగాకు ఫయాజ్ బాషా మరియు కొమ్ము మహేష్ లను అరెస్టు చేసి వారి వద్ద నుండి మొత్తం =౦.1,05,000/- (అక్షరాల ఒక లక్ష ఐదు వేల రూపాయలు) నగదు మరియు నేరము చేయుటకు ఉపయోగించిన వన్ ప్లస్ నార్డ్ సి2 మొబైల్ ఫోన్ను సీజ్ చేసి కేసు నమోదు చేయడమైనది.ఈ సందర్భంగా సి ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ చట్ట విరుద్ధమైన క్రికెట్ బెట్టింగ్ వంటి జూద కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠినమైన చర్యలు తీసుకొంటామని ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఇచ్చిన యెడల వారి వివరాలు గోప్యంగా ఉంచబడును. క్రికెట్ బెట్టింగ్ ముద్దాయిలను పట్టుకున్న సబ్-ఇన్స్పెక్టర్ గోపాల కృష్ణ మరియు పోలీస్ సిబ్బందిని నల్లమాడ సర్కల్ ఇన్స్పెక్టర్ అభినందించారు.

# ముత్తుకూరు స్ సి కాలనీలో డ్రైనేజ్ సమస్యపై తక్షణ చర్య అభివృద్ధికి హామీ

**ఆస్పరి ఏప్రిల్ 17 యువతరం న్యూస్ : వైకుంఠం జ్యోతి ఆదేశాలతో తక్షణ చర్య**

ఆస్పరి మండలం ముత్తుకూరు గ్రామంలోని స్ సి కాలనీలో డ్రైనేజ్ నీరు నిల్వై చెత్త పేరుకుపోయి, మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న వెంటనే సింగిల్ విండో డైరెక్టర్ మల్లికార్జున స్పందించారు. ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ ఆదేశాల మేరకు, మల్లికార్జున స్వయంగా గ్రామానికి వెళ్లి జేసీబీ సహాయంతో కాలువలో పేరుకుపోయిన చెత్తను, చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి తాత్కాలికంగా సమస్యను పరిష్కరించారు.

**మల్లికార్జున మాట్లాడుతూ...**

ముత్తుకూరు గ్రామంలోని సమస్యలను ఆలూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి గారు, గ్రామ





స్పెషల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ఎం ర్ ఓ మల్లికార్జున రెడ్డి గారు, పంచాయతీ సెక్రటరీ జంప్లా నాయక్ గారులతో సమన్వయం చేసి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తానని తెలిపారు. అలాగే వైకుంఠం జ్యోతి ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.వైకుంఠం జ్యోతి ఆదేశాలతో తక్షణ చర్య. డ్రైనేజ్ నీరు నిల్వతో స్ సి కాలనీలో తీవ్ర సమస్య. మురికి నీరు రోడ్లపై ప్రవహించి ప్రజలకు ఇబ్బందులు.,జేసీబీ తో చెత్త, పిచ్చి మొక్కల తొలగింపు,అధికారులు సమన్వయంతో సమస్యల పరిష్కారం,గ్రామ అభివృద్ధికి హామీ.తక్షణ స్పందనకు సంతోషం వ్యక్తం చేశారు.

# ఉపాధి హామి కూలీలు చేత ఆదివారం పని చేయించే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి




అనకాపల్లి బ్యూరో ఇన్చార్జ్ ఏప్రిల్ 17 యువతరం న్యూస్: దేవరాపల్లి.ఆదివారం కూలీలు చేత ఉపాధి హామి పని చేయించే నిర్ణయాన్ని తక్షణమే ఉప సంహ రించు కోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి డి వెంకన్న డిమాండ్ చేసారు,శుక్రవారం అయిన ప్రకటన విడుదల చేసారు ప్రభుత్వ ఇచ్చిన జాబ్ కార్డు ప్రకారం వారానికి ఆరు రోజులు మించి పని చేయించ రాదన్నారు,అంతకు మించి ఆదివారం పని చేయించే అదికారం ప్రభుత్వానికి లేదన్నారు కూలిలలు,కూలిలు పనిదినాలు పెంపు డబ్బులు గిట్టుబాటు,కావటం లెదని అదనంగా పని చేస్తున్నారని తెలిపారు కూలీలు ఏడు రోజులు పని చూపించి మేటిరియల్ చార్జీలు అదనంగా. కేంద్ర ప్రభుత్వం నుండి పోందడం కోసం కూటమి ప్రభుత్వ కూలీలు శ్రమను దోసెస్తుందని అన్నారు, కూలీలు కష్టంతో పల్లెలు అబివృద్ధి అవుతున్నాయని తెలిపారు, మరోవైపు కూలీలు పనులు చేయకుండా డబ్బులు తినేస్తున్నారని నెపంతో కూలిలను చిన్న చూపు చూస్తున్నారని మండిపడ్డారు ఎండలు తీవ్రంగా ఉన్నాయని ఏడు రోజులు పని చేయటం కష్టమన్నారు కూలిలతో పాటు ఉపాది హామి సిబ్బంది కూడా మాన సికంగా తీవ్ర వత్తిళ్ళకు గురు అవుతున్నారని తెలిపారు ఫేస్ యాప్ విధానం అమలు సమ్మర్ ఎలవెన్సు మంచి నీళ్లు తట్ట.గునపాం టేంట్లు మేడికల్ కిట్లువంటి మౌలిక సదు పాయాలు తోల గించడం వంటి చర్యలు కూలిలు ఉసురు పోసుకుం టుందని తెలిపారు ఇప్పటికే జిల్లాలోని 10 వారాలు నుండి భకాయిలు చేల్లించ లెదని తెలిపారు,వెంటనే భకాయిలు చెల్లించాలని ఫేస్ యాఫ్ విదానం రద్దు చేయాలని ఆదివారం పని విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని లెదంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చెపాట్టడం తో పాటు ఈనెల 20 వ తేదీన అమరావతి ఉపాధి హామీ కమిషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని వెంకన్న స్పష్టం చేశారు.

# ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు తీర్చాలి

**టీఈటీపీ జేఏసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సనాతన బాలస్వామి**

లింగాల యువతరం న్యూస్ ఏప్రిల్ 17 : రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఎంప్లాయిస్ టీచర్స్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆర్గనైజింగ్ సెక్రటరీ సనాతన బాలస్వామి కోరారు. ఈ మేరకు శు క్రవారం ఆయన ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు లింగాల తహసిల్దార్ వెంకటేష్కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా జూన్ 2 నాటికి పీఆర్సీ అమలు చేయాలని, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని కోరారు. అలాగే ప్రకటించిన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ను త్వరితగతిన అమలులోకి తీసుకువచ్చి, ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు జారీ చేయాలని సూచించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని, 2004 సెప్టెంబర్ 1కు ముందు నియమితులైన ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలని పేర్కొన్నారు.పెండింగ్ డీఏలను విడుదల చేయడంతో పాటు ఉద్యోగులకు రావాల్సిన ఇతర బకాయిలను చెల్లించాలని, 61 సంవత్సరాలు పూర్తి చేసిన వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగులు-ఉపాధ్యాయుల సాధారణ బదిలీలు చేపట్టాలని తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ




ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర శర్మ, కృష్ణాజీ, చంద్రశేఖర్, ధర్మాసింగ్, అనిల్, రమేష్, రాజా, సురేష్, కవిత, రాణి, మంజుల, కల్పన తదితరులు పాల్గొన్నారు.

# స్ఫూర్తి ప్రదాతలు వాఙ్మయకిరీటి ఆచార్య కొర్లపాటి (గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం.. ద్వితీయ సంవత్సరం ఇంటర్లో తెలుగులో పాఠ్యాంశం ) స్వగ్రామంలో, సాహితీ వేత్తల్లో హర్షం



## ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి

వేయి వసంతాలు పైబడి చరిత్ర కలిగిన తెలుగు సాహిత్య చరిత్రలో వికసించిన తెలుగు భాషా సామాజిక సంస్కృతిలో విశేష కృషి చేసి గొప్ప సాహితీ వేత్తగా పేరుపొందిన వారిలో ఆచార్య కొర్లపాటి శ్రీరామ మూర్తి ఒకరు. ఆయన తెలుగు సాహిత్యానికి చేసిన విశేషమైన కృషిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వాఙ్మయ కిరీటి... కొర్లపాటి అనే పేరుతో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం తెలుగు ఉప వాచకం లో పాఠ్యాంశాన్ని 2026-2027 సంవత్సరానికి ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో కొర్లపాటి శ్రీరామ మూర్తి స్వగ్రామమైన మాచవరం పంచాయతీ పరిధిలోని అంబాజీ పేటలోనికొర్లపాటి వారి పాలెం ప్రజలు, వారి కుటుంబీకులు మరియు వారి అభిమానులు , బంధువులు,స్నేహితులు సాహితీ మిత్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీ కళా వేదిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జిల్లా అధ్యక్షులు, ప్రముఖ సాహితీవేత్త, సీనియర్ తెలుగు లెక్చరర్, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ గౌరవ ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉగాది పురస్కార గ్రహీత నడక కవి అక్షర ప్రవీణ నల్లా నరసింహమూర్తి వ్యక్తం చేశారు.

**కొర్లపాటి శ్రీరామమూర్తి బాల్యం విద్యాభ్యాసం**

కవి , సాహితీ వేత్త,విమర్శకుడు, కథకుడు ,దర్శకుడు ,ఉత్తమ అధ్యాపకుడు శ్రీరామమూర్తి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని తూర్పు గోదావరి జిల్లా కోనసీమలోని అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీ పరిధిలోని కొర్లపాటి వారి పాలెం లో 1929 అక్టోబర్ 17వ తేదీన కొర్లపాటి మణ్యం, రత్నమణి పుణ్య దంపతులకు మూడో సంతానంగా జన్మించారు. ఆయన స్కూల్ ఫైనాన్స్ చదువుతుండగా అకస్మాత్తుగా తండ్రి మరణించడంతో కుటుంబ భారం శ్రీరామమూర్తి పై పడింది తల్లికి తోడుగా ఇంటిని చక్క దిద్దడానికి శ్రీరామమూర్తి చదువును త్యాగం చేయవలసి వచ్చింది. తాతల కాలం నుండి పుణికి పుచ్చుకున్న జ్యోతిష్యవిద్యకు తోడు పూర్వీకుల నుండి సంక్రమించిన వ్యవసాయాన్ని తండ్రి అకాల మరణంతో చేపట్టాల్సి వచ్చింది. ఆయన చదువుకునే సమయంలో అప్పుడప్పుడు నాన్నతో పొలానికి వెళ్లి వ్యవసాయం చూసుకోవడమే గాని ఏమాత్రం ఆయనకు సాయం చేసి ఎరగడు. శ్రీరామమూర్తి కూలీలను పెట్టి తాను వ్యవసాయం చూసుకుంటూ పొలం గట్టుమీద కూర్చుని పుస్తకాల్లో మునిగి పోయేవాడు .సాహిత్య గ్రంధాలు చదువుకుంటూ రచనావ్యాసంగాలు కొనసాగించేవారు. అలా కొంతకాలం కాలం గడిసిపోయింది.

**ఉన్నత చదువులకు కొత్త అవకాశం**

అలా మూడు సంవత్సరాలు గడిచాక శ్రీరామ మూర్తికి ఉన్నత చదువులకు కొత్త అవకాశం దొరికింది కాకినాడలోని పీఠికా పురాదీశా కళాశాలలో నేటి ( పి ఆర్ ప్రభుత్వ కళాశాల )లోఇంటర్మీడియట్,1950- 1951లో భీమవరం లోని డబ్ల్యూ జిబీ కళాశాలలో నేటి (డిఎన్ఆర్ కళాశాల)లో చేరి బి.ఎ పూర్తి చేశారు.

**వైవాహిక జీవితం ఉద్యోగం**

ఇంటర్మీడియట్ చదువు పూర్తికాగానే నల్లా సుబ్బారావు , అమ్మాయమ్మ దంపతుల 5వ సంతానం వెంకట రమణమ్మతో ఆయనకు వివాహమైంది. భీమవరం లో బిఏ పూర్తయ్యాక 1953-1955 మధ్యకాలంలో భీమవరంలోనూ, రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలోనూ ట్యూటర్ గా పనిచేశారు. ఏయులో అడుగుపెట్టక ముందే పెద్దమనిషి పట్టుదల, కాల సర్పం, నటన తదితర నాటకాలు రాశారు అప్పట్లో ఏయూ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే చారిత్రక నవల పోటీల్లో 1955 జనవరి నెలలో కొర్లపాటి శ్రీరామ మూర్తి రచనలకు బహుమతి లభించింది. అదే సంవత్సరం 1955 జూన్ లో చదువు కోసం విశాఖపట్నంలో కాలు పెట్టారు శ్రీరామమూర్తి 1957లో బి.ఎ ఆనర్స్ లో గోల్డ్ మెడల్ సాధించి చదువు పూర్తి కాగానేఏయూ నుండి "శ్రీనాధుడు సాహిత్యం" అనే అంశంపై పరిశోధక విద్యార్థిగా ఓ మెట్టు ఎక్క గలిగారు. 1959లో ఎ.యులో లెక్చరర్ గా కొత్త బాధ్యతలు స్వీకరించారు. 1963 లో తాను పరిశోధనకు ఎంపిక చేసుకున్న శ్రీనాధుడు కవిత సంపుటికి మంచి గుర్తింపు లభించలేదు అయితే ఏమాత్రం శ్రీరామ మూర్తి చింతించ లేదు ఆత్మ విశ్వాసంతో ఆంధ్ర విశ్వ కళా పరిషత్ తెలుగు శాఖలో 1959 నుండి 1966 వరకూ లెక్చరర్ గా ను 1966 నుండి 1983 వరకు రీడర్ గానూ 19 83 నుంచి 1989 వరకు ప్రొఫెసర్ గా బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహించారు. 1979 నుండి 198 2 మధ్యకాలంలో తెలుగు శాఖా ధ్యక్షులుగా వ్యవహరించారు. 1989లో ఆచార్యునిగా పదవి విరమణ చేసిన తర్వాత 1990లో యూ.జీ.సీ ఎ మరీ టస్ పెలో. గా నియమితులై . నిరంతర పరిశోధనా కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈయన పరిశోధనలు తెలుగు సాహిత్య చరిత్రకు కొత్త మార్గాలు చూపాయి. ఆయన విద్యార్థులు ప్రముఖ పరిశోధకులు గా పేరుపొందారు. ఆకాశవాణిలో ఈయన చేసిన అనేక సాహితీ ప్రసంగాలు సాహిత్య వేత్తలను ఆశ్చర్యపరిచే వి. ఈ రచించిన పరిశోధనా వ్యాసాలు ప్రముఖుల ప్రశంసలు అందుకున్నాయి. ఆంధ్ర విశ్వ కళాపరిషత్ నుండి పరిశోధనకు గాను తెలుగులో మొట్టమొదటి డిలిట్ పొందారు. ఈయన రచించిన ఈ శ్వరార్చన కళాశీలుడు అనే పరిశోధనాత్మక గ్రంథానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి తెలుగులో మొట్టమొదటి డిలిట్ లభించింది.

**కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం**

శ్రీరామ మూర్తి రచించిన సాహిత్య పరిశోధనా గ్రంథాలకు 2009వ సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమీ లక్ష రూపాయలు నగదు బహుమతితో పురస్కారం అందు చేసింది. భాషా సమ్మాన్ పురస్కారంఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ నుండి తెలుగు భాషకు ఆయన చేసిన సేవలు గుర్తింపుగా భాషా సమ్మాన్ పురస్కారంఅందజేసి ఆయన ప్రతిభకు పట్టం కట్టింది. ఈ పురస్కారాలు ఈ గౌరవాలు ఆయన పరిశోధనా కృషికి తెలుగు సాహిత్య చరిత్రలో అందించిన కొత్త దృక్పథాలకు సాక్ష్యం.

**కొన్ని పరిశోధనా గ్రంధాలు**

1. నాద యోగి మన వేమన
2. చరిత్ర చర్చ
3. సాహిత్య సంపద మొదలైనవి రచనలు

నాటక కర్తగా నాటకాలు

పెద్దమని షి, పట్టుదల, కాల సర్పం

నటన 2005(సాంఘిక నాటకం)

ధర్మజ్యోతి 1967(చారిత్రక నాటకం)

సమత 2005 (సాంఘిక నాటకం)

చిత్రశాల చారిత్రక నవల 1957

గుడి గోపురం, వీణ కథల సంపుటి

తెలుగు సాహిత్య చరిత్ర (ప్రథమ ద్వితీయ తృతీయ) భాగాలు

ఈశ్వరార్చన కళాశీలుడు శ్రీనాధుడు పరిశోధన గ్రంథం, 2009లో ఆయన పరిశోధనలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది శ్రీరామ మూర్తి 2011 జూలై 26 తుది శ్వాస విడిచారు.

**ప్రతి ఏటా శ్రీరామమూర్తి జయంతి సభలు**

అమలాపురం లో శ్రీరామమూర్తి జయంతి సభలు ప్రతీ సంవత్సరం అక్టోబర్ 17వ తేదీన శ్రీశ్రీ కళావేదిక జిల్లా శాఖ, కోనసీమ రచయితల సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు సాహితీవేత్త నల్లా నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

**శ్రీరామమూర్తి కుటుంబ వివరాలు**

శ్రీరామమూర్తికి ముగ్గురు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. వారిలో ప్రథమ కుమారుడు సరస్వతీ రావు భారతీయ స్టేట్ బ్యాంకు అధికారిగా ఉద్యోగంచేసి కాకినాడలో స్థిరపడ్డా రు.రెండవ కుమారుడు సత్య గోపాల్ ఐఏఎస్ అధికారి ప్రస్తుతం చెన్నైలో ఉన్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సభ్యులుగా కొనసాగుతున్నారు. మూడవ కుమారుడు వెంకటరమణ మూర్తి ప్రస్తుతం హైదరాబాద్ లో ఉంటూ గ్రూప్ సర్వీసెస్ అభ్యర్థులకు ఇంగ్లీష్ బోధిస్తున్నారు. కుమార్తె గృహిణిగా విశాఖపట్నంలో స్థిరపడ్డారు..ఉగాది రోజున శ్రీరామమూర్తి ప్రథమ కుమారుడు సరస్వతీ రావుఅంబాజీపేటలో అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక నిర్వహించిన 165 వ శతాధిక కవి సమ్మేళనం పాల్గొని సంస్థ సీఈవో కత్తిమండ ప్రతాప్ ప్రశంసలు పొందారు. సరస్వతీ రావు ను శ్రీశ్రీ కళావేదిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు, ప్రముఖ సాహితీవేత్త సీనియర్ తెలుగు లెక్చరర్ నల్లా నరసింహమూర్తి సభకు పరిచయం చేశారు. ఫోటోగ్రఫీలో సరస్వతీ రావు కు అనేక, రాష్ట్రస్థాయి అంతర్జాతీయ స్థాయి అవార్డులు లభించి నందుకు శంఖారావం వరల్డ్ ఫేమస్ కమాండెంట్ ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం రాజమహేంద్రి వరం ఎస్పీ కొండా నరసింహారావు ప్రత్యేకంగా సరస్వతీ రావును ఉగాది పురస్కార వేదికపై అభినందించారు.నల్లా నరసింహమూర్తి సీనియర్ తెలుగు లెక్చరర్

# ఏప్రిల్ 21, 22, 23 తేదీలలోఅమలాపురం

# శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఏకాదశి వార్షిక బ్రహ్మోత్సవాలు








అమలాపురం ప్రతినిధి ఏప్రిల్ 17 యువతరం న్యూస్:అమలాపురం కిమ్స్ మెడికల్ కళాశాల ప్రాంగణంలో గల శ్రీ దేవిభూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 21, 22 ,23 తేదీలలోవైభవంగా జరగనున్నవి. మొదటి రోజు 21వ తేదీన సాయంత్రం ఐదు గంటలకు గాయకులు, బోధకులు భగవద్గీత ప్రచారకులు భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకులు మరియు చైర్మన్ బ్రహ్మశ్రీ డాక్టర్ ఎల్.విగంగాధర శాస్త్రి ఆధ్యాత్మిక ప్రవచనము మరియు వారికి సన్మాన కార్యక్రమం జరుగుతుంది. రెండో రోజు 22వ తేదీన సాయంత్రం ఐదు గంటలకు కళ్యాణ మహోత్సవం మరియు అన్నప్రసాద వితరణ జరుగుతుంది. భక్త మహాశయులు పాల్గొని శ్రీ స్వామివారి కృపాకటాక్షములు పొందవలసింది గా ఫౌండర్ మరియు చైర్మన్ కిమ్స్, ఛాన్స్ లర్ గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ, రాజమహేంద్రవరం. కె.వి.వి సత్యనారాయణ రాజు (చైతన్య రాజు), కిమ్స్ హాస్పిటల్ అండ్ మెడికల్ కాలేజీ మేనేజింగ్ డైరెక్టర్ కే .రవి కిరణ్ వర్మ, కిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే శశివర్మ ఒక ప్రకటనలో కోరా రు. అమలాపురంలోని కిమ్స్ మెడికల్ కళాశాల ప్రాంగణంలో గల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ని పూజిస్తే జీవితంలో కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఎంతోమంది రోగులు ఇక్కడ కిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు పొంది ఆరోగ్యంగా ఆనందంగాఇంటికి తిరిగి వెళుతూ శ్రీ వెంకటేశ్వర స్వామిని సేవించుకుని వెళతారు. నిరంతరం భక్తులతో ఈ ఆలయం నిండి ఉంటుంది. వేం.. అనగా పాపాలు, కట... తొలగించే ఈశ్వరుడైన భగవంతుడు అని అర్థం. అనగా భక్తుల పాపాలు ,కష్టాలను తొలగించేవాడు శ్రీ వెంకటేశ్వర స్వామిఅని కలియుగంలో భక్తులు నమ్మకం. జీవుల పాపాలు కష్టాలు తొలగించే సర్వశక్తిమంతుడైన విష్ణుదేవుని అవతార మూర్తి మహిమగల శ్రీ వెంకటేశ్వర స్వామి అని భక్తులు విశ్వసిస్తారు. భక్తుల కష్టాల్లో సహాయపడే సౌమ్య కరుణామయునిగా శ్రీ వెంకటేశ్వర స్వామిని భక్తుల పేర్కొంటారు. నిత్యం "ఓం నమో వెంకటేశాయ" మంత్రం జపించడం వల్ల జీవితంలో కష్టాలు తొలగిపోతాయని భక్తులను నమ్ముతారు భక్తి తత్వం హిందూ ఆధ్యాత్మికతలో భక్తి మార్గానికి చెందిన లోతైన సిద్ధాంతం. ఇది భగవంతుని పట్ల భక్తుని కి అచంచలమైన విశ్వాసం కలిగిస్తుంది. భక్తులు కోరుకున్న కోరికలు తీర్చే వెంకటేశ్వర స్వామిగా భక్తుల్లో అపారమైన విశ్వాసం ఉంది. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరా స్వామి భక్తులను రక్షించేందుకు స్వయంగా భూమిపై అవతరించిన భగవంతుడు గా భక్తుల నమ్మకం గోవిందా! గోవిందా ! అంటూ భక్తితో మనసారా పిలిచిన ప్రతి హృదయం నీ కరుణ లో మునిగితే పాపా లన్ని క్షణంలో పారిపోతాయి.. "భక్తులు హృదయాలలో నిలిచిన శ్రీ వెంకటేశా నీ రూపం దివ్య రూపం ఓ వేంకటరమణానీ దర్శనమే మాకు పరమానందం నీ కృప జీవితానికి సత్యానందం"అంటూ భక్తులు ప్రార్థిస్తూ భక్తిలో మునిగిపోతారు ఇక్కడ మూడు రోజులపాటు జరిగే ఏకాదశి వార్షిక బ్రహ్మోత్సవాలకు భక్తులు అధికంగా విచ్చేసి స్వామివారిని సేవిస్తారు.

# జలధార కార్యక్రమంతో భూగర్భ జలాల పెంపు లక్ష్యం

నీటి వనరుల సమర్థ వినియోగంపై కలెక్టర్ దిశానిర్దేశం

జిల్లాలో నీటి సంక్షోభ నివారణకు ప్రత్యేక చర్యలు


మండలాల వారీగా జలవనరుల సమగ్ర గణాంకాల సేకరణ

కాస్కేడ్ సిస్టమ్‌తో చెరువుల అనుసంధానం

డోన్, ప్యాపిలి మండలాల్లో నీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి

గ్రామ స్థాయిలో జల సంరక్షణకు ప్రజల భాగస్వామ్యం అవసరం

జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా






నంద్యాల ప్రతినిధి ఏప్రిల్ 17 యువతరం న్యూస్: జిల్లాలో 100 రోజుల 'జలధార' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసి భూగర్భ జలాల మట్టాన్ని పెంచేందుకు సమిష్టిగా అంకితభావంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన 'జలధార' కార్యక్రమానికి సంబంధించిన వర్క్‌షాప్‌లో కలెక్టర్ పాల్గొని ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు మరియు సంబంధిత శాఖల అధికారులకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల సమర్థ వినియోగం, గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్యల నివారణ లక్ష్యాలుగా తీసుకుని100 రోజుల 'జలధార' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి అధికారి తమ పరిధిలో ప్రణాళికాబద్ధంగా పని చేసి స్పష్టమైన ఫలితాలు సాధించాలని ఆదేశించారు. జిల్లాలోని 30 మండలాల్లో 11 మండలాలు నీటి నిల్వ విషయంలో క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వర్షాల అనంతరం భూగర్భ జలాల మట్టం 3 మీటర్ల లోపల, వర్షాలకు ముందు 8 మీటర్ల లోపల ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి ఆ మేరకు లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని తెలిపారు. కృష్ణా నది జిల్లాలోకి ప్రవేశించిన తర్వాత శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్, తెలుగు గంగ, కెనాల్, కేసీ కెనాల్‌లుగా విభజించి సుమారు 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్లు వివరించారు. అయితే డోన్ మండలంలోని కొచ్చెరువు ప్రాంతంలో భూగర్భ జలాలు సుమారు 45 మీటర్ల లోతులో ఉన్నాయని, జిల్లాలోని 165 గ్రామాల్లో నీటి మట్టం 20 మీటర్ల కంటే ఎక్కువ లోతులోకి పడిపోయిందని చెప్పారు. డోన్, ప్యాపిలి మండలాల్లో నీటి ఎద్దడి అధికంగా ఉందని తెలిపారు. ప్రతి మండలానికి సంబంధించిన భూగర్భ జలాల గణాంకాలను సిద్ధం చేయాలని, గ్రామ మరియు మండలాల వారీగా నీటి మట్టం వివరాలను సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. చెరువులు, కుంటలు తదితర నీటి వనరులపై పూర్తి వివరాలతో నివేదిక తయారు చేయాలని సూచించారు. జిల్లాలో ఉన్న 330 మైనర్ ఇరిగేషన్ చెరువుల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని చెప్పారు. నీటి వనరులు నిండే విధానాలపై అవగాహన కల్పిస్తూ, వర్షపాతం, మేజర్ కెనాల్స్ ద్వారా నీటి మళ్లింపు, సహజ ప్రవాహాల ద్వారా నీటి చేరిక వంటి అంశాలలో ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని చెరువులు నిండడం కొన్ని కెనాల్స్ ద్వారా, మరికొన్ని సహజ ప్రవాహాల ద్వారా, మిగిలినవి పూర్తిగా వర్షాలపై ఆధారపడుతున్నాయని పేర్కొన్నారు. 'కాస్కేడ్ సిస్టమ్' ప్రాముఖ్యతను వివరిస్తూ, ఒక చెరువు నిండిన తరువాత అదనపు నీరు వరుసగా ఇతర చెరువులకు చేరే విధానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో 27 కాస్కేడ్లలో మొత్తం 86 ట్యాంకులు ఉన్నట్లు తెలిపారు. భూగర్భ జలాల పెంపు కోసం ఫామ్ పాండ్స్, చెక్ డ్యామ్స్, రాక్ ఫిల్ డ్యామ్స్, కాంటూర్ ట్రెంచెస్ వంటి నిర్మాణాలను గుర్తించి, వాటి స్థితిగతులను అంచనా వేసి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామంలో భూగర్భ జలాల మట్టం, మండల సగటు, ప్రస్తుత నీటి వనరుల నిర్మాణాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చెరువుల స్థితి, ఫీడర్ ఛానల్స్ పరిస్థితి, సహజ నీటి ప్రవాహాలపై పరిశీలన జరిపి చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామస్తుల భాగస్వామ్యంతో నీటి వనరుల అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని, ఎండకాలంలో కూడా నీటి నిల్వ ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. నంద్యాల జిల్లా భౌగోళికంగా కృష్ణా, పెన్నా బేసిన్లలో విస్తరించి ఉందని కలెక్టర్ తెలిపారు. ఇందులో సుమారు 75% కృష్ణా బేసిన్‌లో, 25% పెన్నా బేసిన్‌లో ఉందన్నారు. తుంగభద్ర బేసిన్ కృష్ణా పరిధిలో భాగం కాగా, నందికొట్కూరు తుంగభద్రలో, ఆళ్లగడ్డ పెన్నా బేసిన్‌లోకి వస్తాయన్నారు. పెన్నా బేసిన్‌లో కుందేరు నది ముఖ్య ఉపబేసిన్ అని, జిల్లాలో నీటి నిల్వల కొరత వల్ల వరదనీరు వృథాగా ఇతర జిల్లాలకు వెళ్లుతోందని కలెక్టర్ వివరించారు. ఈ వర్క్ షాప్ లో జల వనరుల శాఖ ఎస్ఈ శివశంకర్ రెడ్డి, భూగర్భ జల అధికారి రఘురాం, డ్వామా పీడీ సూర్యనారాయణ, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ నాగరాజు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏయే రకాల కూరగాయల జ్యూస్‌లను తాగితే ఎలాంటి లాభాలు కలుగుతాయో తెలుసా..?



మనం రోజువారి ఆహారంలో భాగంగా అనేక రకాల కూరగాయలను లేదా ఆకుకూరలను కూరలుగా చేసుకుని తింటుంటాం. ఇందులో భాగంగానే అనేక రకాల కూరగాయలు మనకు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా తమకు నచ్చిన లేదా అందుబాటులో ఉన్న కూరగాయలు లేదా ఆకుకూరలనే తరచూ తింటుంటారు. అయితే కూరగాయలను పచ్చిగా కూడా తినవచ్చు. కూరగా చేసి తినడం కన్నా కొన్ని రకాల కూరగాయలను పచ్చిగా తింటేనే మనకు ఎక్కువ ప్రయోజనాలు కలుగుతాయి. అయితే కూరగాయలను నేరుగా అలా పచ్చిగానే తినేకంటే వాటిని జ్యూస్‌లా తయారుచేసి తాగితే ఇంకా ఎక్కువ ఫలితం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. కూరగాయలను పచ్చిగా తినడం కొందరికి కష్టమవుతుంది. అలాంటి వారు వాటితో జ్యూస్ తయారు చేస్తే చాలా సులభంగా తాగవచ్చు. ఇక ఒక్కో రకమైన కూరగాయల జ్యూస్‌ను తాగడం వల్ల మనకు భిన్న రకాల ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

టమాటాలు, క్యారెట్లు..

మనకు సంవత్సరం పొడవునా అందుబాటులో ఉండే కూరగాయల్లో టమాటాలు ఒకటి. టమాటాలను నేరుగా అలాగే పచ్చిగా తినవచ్చు. కానీ జ్యూస్ చేసుకుని తాగితే ఎంతో రుచిగా ఉంటుంది. రోజూ చాలా సులభంగా తాగవచ్చు. టమాటా జ్యూస్‌ను రోజూ తాగితే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరానికి ఐరన్ లభిస్తుంది. రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. టమాటాల్లో ఉండే విటమిన్ ఎ కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. కంటి చూపును మెరుగు పరుస్తుంది. టమాటా జ్యూస్‌ను తాగడం వల్ల శిరోజాలు, చర్మం ఆరోగ్యంగా ఉంటాయి. ఎముకలు దృఢంగా మారుతాయి. షుగర్, కొలెస్ట్రాల్, బీపీ తగ్గుతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. అలాగే క్యారెట్ జ్యూస్‌ను రోజూ తాగడం వల్ల కూడా మనకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ జ్యూస్ వల్ల కంటి చూపు మెరుగు పడుతుంది. అధిక బరువు సులభంగా తగ్గవచ్చు. జీర్ణ సమస్యలు ఉండవు. కొలెస్ట్రాల్, బీపీ నియంత్రణలో ఉంటాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది.


పాలకూర, క్యాబేజీ..

పాలకూర జ్యూస్‌ను రోజూ తాగడం వల్ల రోగ నిరోధక శక్తిని పెంచుకోవచ్చు. కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. కంటి చూపు మెరుగు పడుతుంది. క్యాన్సర్ కణాలు నాశనం అవుతాయి. క్యాన్సర్లు రాకుండా అడ్డుకోవచ్చు. హైబీపీ ఉన్నవారు ఈ జ్యూస్‌ను రోజూ తాగుతుంటే ఎంతో ఫలితం ఉంటుంది. దీని వల్ల చర్మం, శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి. ఎముకలకు బలం లభిస్తుంది. కీళ్ల నొప్పులు, వాపులు తగ్గిపోతాయి. ఆర్థరైటిస్ నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే రక్తహీనత తగ్గుతుంది. అలాగే రోజూ క్యాబేజీ జ్యూస్‌ను కూడా సేవించవచ్చు. దీని వల్ల మన శరీరానికి అనేక పోషకాలు లభిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్ తొలగించబడతాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. గుండె పోటు, క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు. శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. చర్మం సురక్షితంగా ఉంటుంది. అధిక బరువు సులభంగా తగ్గుతారు. లివర్ ఆరోగ్యంగా ఉంటుంది.

కొత్తిమీర, బీట్ రూట్..

చిలగడ దుంపలను రోజూ నేరుగా తినవచ్చు. జ్యూస్‌గా తయారు చేసి కూడా తాగవచ్చు. ఈ జ్యూస్‌ను తాగితే ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. అధిక బరువును తగ్గించుకోవచ్చు. కంటి చూపు మెరుగు పడుతుంది. బీపీ, కొలెస్ట్రాల్, షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. జీర్ణ శక్తి మెరుగు పడుతుంది. అల్సర్లు ఉన్నవారికి ఔషధంగా పనిచేస్తుంది. అలాగే రోజూ కొత్తిమీర జ్యూస్‌ను కూడా తాగవచ్చు. ఇది రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. క్యాన్సర్ కణాలు వృద్ధి చెందకుండా చేస్తుంది. గుండె సురక్షితంగా ఉంటుంది. ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. అలాగే బీట్ రూట్ జ్యూస్‌ను కూడా రోజూ సేవిస్తుండవచ్చు. దీని వల్ల హైబీపీ తగ్గుతుంది. కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. లివర్, కిడ్నీల్లో ఉండే వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. ఇలా ఆయా రకాల కూరగాయల జ్యూస్‌లను రోజూ తాగుతుంటే భిన్న రకాల లాభాలను పొందవచ్చు. అయితే రోజూ ఏదైనా ఒక జ్యూస్‌ను మాత్రమే తాగాలి. ఉదయం పరగడుపున తాగితే ఎక్కువ ఫలితం ఉంటుంది. ఒక కప్పు మోతాదులో ఏ జ్యూస్‌ను అయినా సరే తాగవచ్చు.

# పర్మిషన్స్ డేంజర్ బెల్స్!



రోజువారీ లైఫ్‌లో యాప్స్ లేకుండా ఉండలేం. చాటింగ్, ఎంటర్‌టైన్‌మెంట్, బిల్ పేమెంట్స్%ౌ% అన్నింటికీ ఫోనే మన బెస్ట్ ఫ్రెండ్ అయిపోయింది. అయితే, ఈ యూజ్-కేస్ వెనుక పెద్ద రిస్క్ దాగుంది. యాప్‌ని ఇన్‌స్టాల్ చేసేటప్పుడు, అవి అడిగే పర్మిషన్స్ మన డేటాను మామూలుగా ఊడ్చేయట్లేదు, ఏకంగా బ్రేక్-ఇన్ చేస్తున్నాయి. పర్మిషన్ అనేది ఒక చిన్న బటన్ కాదు, అది మన ప్రైవసీకి తాళం చెవి. కానీ చాలా యాప్స్%ౌ% అవసరం లేని యాక్సెస్ అడుగుతున్నాయి. ఉదాహరణకు ఫొటో ఎడిటింగ్ యాప్ మన కాంటాక్ట్ లిస్ట్‌ని ఎందుకు అడగాలి? ఒక గేమింగ్ యాప్ మన లొకేషన్‌ని ఎందుకు ట్రాక్ చేయాలి? ఇక్కడే అసలు ఫ్రాడ్ మొదలవుతుంది! యూజర్లమైన మనం ఎలో బటన్ నొక్కే ముందు ఆలోచించాలి. యాప్ డెవలపర్స్ కూడా ఎథిక్స్‌తో ఉండాలి. అవసరమైన యాక్సెస్ మాత్రమే అడగాలి. మొబైల్‌లో వివిధ రకాల అప్లికేషన్లు ఇన్‌స్టాల్ చేసినప్పుడు తెగ పర్మిషన్లు అడుగుతుంటాయి. అవేం పట్టించుకోకుండా చకచకా యాక్సెప్ట్ చేసేయడం చాలామందికి అలవాటు. కానీ, మనమిచ్చే పర్మిషన్స్ వల్ల యాప్ నిర్వాహకులు అందుకునే డేటాతో జరిగే క్రైమ్ లిస్ట్ చాలా పెద్దదే!పర్సనల్ డేటా ఫసక్: మనకు తెలియకుండానే కాంటాక్ట్ లిస్టులు, లొకేషన్ డేటా, సేవ్ చేసిన పాస్‌వర్డ్‌లు లాగేస్తాయి. మాల్‌వేర్ అటాక్: కొన్ని యాప్స్ మన ఫోన్‌లో వైరస్‌లు, మాల్‌వేర్‌లను పంపిస్తాయి. ఆ తర్వాత, టోటల్ కంట్రోల్ క్రిమినల్స్ చేతిలోకి వెళ్తుంది.ఖాతా ఖాళీ: దొంగలించిన డేటాతో యూజర్ల బ్యాంక్ ఖాతాలు కొల్లగొడుతున్నారు ఫ్రాడ్‌స్టర్లు!ఫిషింగ్ మాస్టర్స్: అనవసరమైన యాక్సెస్‌ను వాడుకుని, బ్యాంకుల్లాగా లేదా పెద్ద కంపెనీల్లాగా మనకు కాల్స్/మెసేజ్‌లు పంపి, మరింత సెన్సిటివ్ డేటాను లాగేస్తారు.

# మలేసియాలో ట్రంప్ మోదీ భేటీ లేనట్లే..

## ఆసియాన్ సదస్సులో వర్చువల్‌గా పాల్గొననున్న ప్రధాని



మలేసియాలో ఈ నెల ఆసియాన్ సదస్సు జరగనున్న విషయం తెలిసిందే. కౌలాలంపూర్‌లో అక్టోబరు 26 నుంచి 28 వరకు జరగనున్న ఈ సదస్సుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరుకావడం లేదు. ఈ విషయాన్ని ప్రధాని స్వయంగా ప్రకటించారు. ఈ సమ్మిట్‌లో వర్చువల్ గా పాల్గొననున్నట్లు తెలిపారు. ఆసియాన్-భారత్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా బలోపేతం చేయడానికి ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఈ సదస్సు నేపథ్యంలో మలేషియాతోపాటూ కంబోడియాలో కూడా ప్రధాని పర్యటించాలని తొలుత భావించారు. అయితే, తాజాగా ఆయన ఈ సదస్సుకు వెళ్లకపోవడంతో.. కంబోడియా పర్యటన కూడా వాయిదా పడింది. ఈ సమ్మిట్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా అనేక దేశాల నాయకులు హాజరుకానున్నారు. ప్రధాని మోదీ గైర్హాజరు నేపథ్యంలో ట్రంప్ మోదీ భేటీ ఈసారి కూడా లేనట్లే. ఈ ఆసియాన్‌లో మలేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం, మయన్మార్ వంటి 10 దేశాలు సభ్యదేశాలుగా ఉన్నాయి. ఈ సమ్మిట్‌లో ప్రధాని మోదీకి బదులు విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలుస్తోంది.


# ఆర్థిక పుష్టి కోల్పోయి శుష్కించిన తెలంగాణ



ప్రజల జీవితాలను మెరుగుపరిచే మార్గాలను అన్వేషించి, వాటిని అమలు పరచడమే ప్రజా నాయకుడి లక్షణం. ప్రజల జీవితాలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో వెల్లివిరియాలంటే రాష్ట్ర ఆర్థిక స్థోమత అత్యావశ్యకం. వెనుకబడిన, అన్ని రకాలుగా అణగదొక్కబడిన మన తెలంగాణను స్వర్ణ తెలంగాణగా తీర్చిదిద్దుకుందామనే ఆశయంతో దశాబ్దాలుగా పోరు సల్పి ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నాం. కొత్తగా సాధించుకున్న రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి కావాల్సిన సకల వనరులను కల్పించి, ఆదాయ మార్గాలను సృష్టించి, ఆస్తులను పెంపొందించుకొని, తద్వారా రాష్ట్ర సంపదను వృద్ధి చేసుకునే దిశగా చర్యలు తీసుకున్నది తెలంగాణ తొలి ప్రభుత్వం. తెలంగాణ ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడిన రాష్ట్రం. కాబట్టి రైతును రాజును చేస్తే ప్రజలు బాగుపడతారని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనతికాలంలోనే గుర్తించింది. ఆ దిశగా మేధోమథనం గావించి నీళ్ల సదుపాయం కల్పించడమే కాకుండా, అందుకు విద్యుత్తు కూడా అవసరమని భావించి ఈ రెండింటినీ సమకూర్చేందుకు గత ప్రభుత్వం తగిన చర్యలు తీసున్నది. రైతు సంక్షేమం కోసం పాటుపడింది. రైతుబంధు పథకాన్ని తీసుకొచ్చి పంట పెట్టుబడిని ప్రభుత్వమే సమకూర్చింది. దాంతో రైతుకు ధైర్యం కల్పించినట్టయింది. ఏదైనా కారణం వల్ల రైతు చనిపోతే అతని కుటుంబం ఆగమాగం కాకుండా ఉండటానికి రైతు బీమాతో ధీమా కల్పించి ఆయా కుటుంబాలకు అండగా నిలిచింది. సరైన సమయానికి విత్తనాలు, యూరియా మొదలైనవి అందుబాటులో ఉంచి 'మీరు పుట్లకు పుట్లు పండించుకోండి. మేం ప్రతి గింజను కొంటాం' అని విశ్వాసం కలిగించింది. పంటలు పండాలంటే ముఖ్యంగా పుష్కలంగా నీళ్లు కావాలి. మన రాష్ట్రంలో నీళ్ల వసతి లేక దశాబ్దాల పాటు తెలంగాణ బీడువారింది. అందుకే తొలుత నీళ్ల సౌలత్ కల్పించేందుకు కేసీఆర్ సర్కార్ పూనుకున్నది. రాష్ట్రమంతటా విరివిగా సాగునీరు పారించాలని, తద్వారా వ్యవసాయ భూములన్నీ సాగులోకి తీసుకురావాలనే సత్సంకల్పంతో కాళేశ్వరం పేరిట బహుళార్థ సాధక ప్రాజెక్టును ఆవిష్కృతం చేసింది. రోజంతా కరెంట్ ఉంటేనే కదా రైతు తన పొలంలో పనిచేసేది. ఎప్పుడో అర్ధరాత్రి కరెంటు ఇచ్చి, రైతుకు కంటి నిండా నిద్ర లేకుండా చేసే బదులు 24 గంటలూ కరెంటు ఇచ్చి రైతును ఆదుకోవాలని, అర్ధరాత్రి బాయిల కాడ జాగారం చేసే కష్టాన్ని గత ప్రభుత్వం తప్పించింది. ప్రజా ప్రభుత్వమంటే ఇది గదా. రోజంతా కరెంటు ఇచ్చి, పుష్కలంగా నీళ్లు ఇచ్చి, పెట్టుబడికి సరిపడా డబ్బులిచ్చినందుకు గదా రైతు ఆనందపడి సమృద్ధిగా పంటలు పండించిండు. ఆ పంటను సరైన ధరకు మార్కెట్‌లో అమ్ముకుంటేనే గదా ఆ రైతుకు ప్రయోజనం. పంట పొలాల దగ్గరకు వెళ్లి కాంటాలు పెట్టించి ఆ అవసరాన్ని కూడా తీర్చింది గత బీఆర్ఎస్ ప్రభుత్వం. రైతును రారాజును చేసింది. గుక్కెడు నీళ్ల కోసం చాంతాడు, బొక్కెన పట్టుకొని మైళ్ల కొద్దీ నడిచే ప్రయాసను తప్పించడానికి గత సర్కార్ మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసింది. అంతేగాక, గర్భిణులు, నవజాత శిశువులు, బాలింతలను కంటికి రెప్పలా కాపాడుకున్నది. అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం ఇచ్చి తల్లీబిడ్డలను సురక్షితంగా చూసుకున్నది. మౌలిక వసతులు కల్పించడంతో పాటు కేసీఆర్ కిట్, రూ.13 వేల ఆర్థికసాయం చేయడంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు పెరిగాయి. సిజేరియన్ల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయింది. పింఛన్లు రూ.2 వేలకు పెంచడంతో వృద్ధులు సంతోషంగా జీవించగలిగారు. రియల్ ఎస్టేట్ బాగా పుంజుకునేటట్టు చర్యలు తీసుకొన్నారు. గొర్రెల పెంపకంలో కొత్త విధానాన్ని తీసుకొచ్చి, రాష్ట్రంలో పశుసంపదను పెంచారు. కొత్త జలాశయాలు అందుబాటులోకి రావడంతో చేపల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. తద్వారా రికార్డు స్థాయిలో దిగుబడి వచ్చింది. ఇట్లాంటి ఎన్నో కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ద్వారా తలసరి ఆదాయం మూడింతలు పెరిగింది. రాష్ట్ర ఆదాయ వనరులు, వ్యక్తుల ఆదాయాలు పెరగడంతోపాటు సంపద కూడా హెచ్చింది. దీంతో ప్రతి సంవత్సరం వస్తు, సేవల ఉత్పత్తి పెరిగి రాష్ట్ర జీడీపీ వృద్ధి సాధించింది.

వివిధ సంక్షేమ పథకాలను ఆరంభించి, పేదల బతుకులను చిగురింపజేసింది గత ప్రభుత్వమేనాయే. పర్యావరణ సమతుల్యత కోసం కోటానుకోట్ల మొక్కలు నాటించి అడవుల విస్తీర్ణాన్ని పెంచింది. వివిధ సంక్షేమ పథకాల వల్ల కేసీఆర్ పాలనలో పేదరికం 12 శాతం తగ్గిందని గణంకాలు తేల్చిచెప్పాయి. ఇంకేం కావాలి? ఇది గదా ప్రభుత్వం చేయవలసింది. గత ప్రభుత్వంలో జీఎస్టీ వసూళ్లలో ఏటా రెండంకెల వృద్ధి నమోదైంది. మరి ఇప్పుడు జీఎస్టీ వసూళ్లు పెరగకపోగా, మైనస్ వృద్ధిరేటును నమోదు చేసింది. అంటే ఆర్థిక ప్రణాళికలు సరిగ్గా లేనట్టే గదా? ఉద్యోగులకు జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదు. పెంచుతామన్న పింఛన్లు ఇవ్వడం లేదు. ఇదివరకు ఇచ్చే రైతుబంధు కూడా ఇవ్వట్లేదు. రైతు బీమా ఊసే లేదు. అదీగాక 500 మందికి పైగా రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. నేత కార్మికులు కూడా దురవస్థ పాలయ్యారు. కల్యాణలక్ష్మి కింద ఇస్తామన్న తులం బంగారం మాటే మర్చిపోయారు. రిటైర్ అయిన ఉద్యోగులకు ఇవ్వవలసిన పెన్షన్ ప్రయోజనాలే ఇవ్వలేకపోతున్నారంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో ఊహించుకోవచ్చు. మరి ఈ రెండేండ్ల పాలనలోనే లక్షల కోట్లు అప్పు తెచ్చి ఎక్కడ వినియోగించినట్టు? ఆర్థిక వృద్ధి లేకపోగా తిరోగమన దిశలో ప్రయాణించడం సిగ్గుచేటు. గత పాలకులు ఆస్తులు సృష్టించి, సంపద పెంచి, ప్రజలకు పంచడంలో కృతకృత్యులయ్యారు. గత పదేండ్లలో నాటి ప్రభుత్వం తెలంగాణను ఆర్థికంగా పటిష్ఠం చేసుకుంటూపోయింది. ప్రజా పాలకుని ఆలోచన విధానం, పరిపాలన దక్షతను, సమర్థతను ఈ వృద్ధి ప్రతిబింబిస్తుంది. ప్రస్తుత ప్రభుత్వ ఏలుబడిలో ఏదైనా ఒక్క వర్గం ప్రజలైనా సంతోషంగా ఉన్నారా? ఇకనైనా సక్రమంగా ఆలోచించి, తగు ఆర్థిక ప్రణాళికలు వేసి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతారని ఆశిద్దాం. (వ్యాసకర్త: ప్రిన్సిపాల్, జయముఖి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్)

# పోటెత్తిన అల



సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో రూ.5 వేల బహుమతి పొందిన కథ. నీలాకాశంలో ప్రకాశిస్తున్న చంద్రుడు.. తన వెన్నెల వెన్నెలను ఆ ప్రదేశమంతా ఒలకబోస్తున్నాడు. ఆ వెన్నెల వెలుగులకు బిక్కబోయిన నక్షత్రాలు.. చంద్రుడితో పోటీపడలేక అతనికి దాసోహమన్నట్లుగా మిణుకు మిణుకుమంటున్నాయి. సముద్రతీరంలో కొందరు హాయిగా సేదతీరుతున్నారు. మరికొందరు యువతీయువకులు గుంపులు గుంపులుగా విహరిస్తున్నారు. కొంతమంది పిల్లలు ఇసుకలో ఆటలాడుతున్నారు. అక్కడే కొంచెం దూరంగా వెల్లకిలా పడుకుని ఉన్న ఏడుకొండలు మనసులో సంతోషం సముద్రపు అలల్లా ఎగసెగసి పడుతున్నది. సముద్రం మీదినుంచి రయ్యిమంటూ వీచే గాలికి అతని తలవెంట్రుకలు చిందరవందరగా అవుతున్నా.. ఇసుక రేణువులు ఎగిరొచ్చి మీదపడుతున్నా అతను పట్టించుకోలేదు. పుట్టి బుద్ధెరిగినప్పటినుంచీ అతనికి ఆట పాటలన్నీ ఆ సముద్రంతోనే! నురగలతో నాట్యం చేస్తున్న ప్రియనేస్తమైన సముద్రమంటే అతనికి తగని ఇష్టం. ఆ సముద్రం తర్వాత మళ్లీ అతనికి మరో ప్రియాతిప్రియమైన స్నేహితుడున్నాడు. అతనే ఓబులేసు. ప్రస్తుతం అతని మనసు సంతోషంతో ఉప్పొంగిపోవడానికి కారణం.. ఆ స్నేహితుని నుంచి ఫోన్ రావడమే. చిన్నతనంలో తనతో కలిసి పెరిగిన తన స్నేహితుడు ముంబయిలో ఉన్నాడని మాత్రమే అతనికి తెలుసు. ఎన్నో ఏళ్లుగా ఒక్కసారి కూడా కనిపించని ఓబులేసు.. తననెప్పుడో మరిచిపోయి ఉంటాడని అతను అనుకున్నాడు. అయితే.. 'అతని ఆలోచన అబద్ధం' అని రుజువు చేస్తూ ఒకరోజు అతనికో ఫోన్ వచ్చింది.

**అతను లిఫ్ట్ చేసి..**

"హల్లో.. ఎవురూ?" అని అడిగాడు.
"ఎవరు మాట్లాడేది? ఏడుకొండలేనా?"
అవతల నుంచి ప్రశ్న వచ్చింది.

**"అవును! తమరెవురు?" అడిగాడతను..**

కాస్త బెరుగ్గా.
"ఎవరేంట్రా.. నేను ఓబులేసుని. గుర్తుపట్టావా?" అన్నాడు అవతలి వ్యక్తి.
చిరపరిచితమైన ఆ గొంతు వినగానే అతనికి
ఒక్కక్షణం నోట మాట రాలేదు. మెల్లిగా గొంతు
పెగుల్చుకుని..
"ఎవురూ? ఓబులేసు గారేనా?" అనడిగాడు.

"ఒరే ఫూల్! 'గారు' ఏంట్రా? నేను నీ స్నేహితుణ్నిరా. నన్ను 'ఒరే ఓబులేసు' అని పిలవరా" అని వినిపించడంతో అతను ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

"నువ్వా.. నువ్వేనా? నేన్నీకు గుర్తున్నానా?" అనుమానంగా అడిగాడు.

"గుర్తుండటానికి నిన్నసలు మర్చిపోతే గదరా! నేను వచ్చే బేస్తవారం నిన్ను కలవడానికి మన ఊరికి వస్తున్నా. అందుకే ముందుగా చెప్తున్నా" అన్నాడు.

"అలగలాగే! నీకోసం ఎయిటింగ్ సేస్తుంటా!" అన్నాడు ఏడుకొండలు.

ఓబులేసు వస్తున్నాడన్న సంతోషంలో అతని కాలు ఒకచోట కుదురుగా నిలవలేదు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలు అతని మనసులో సుడులు తిరగసాగాయి.పక్కపక్క ఇళ్లలో పుట్టిన ఏడుకొండలు, ఓబులేసు మధ్య బాల్యంనుంచే విడదీయరాని బంధం ఏర్పడింది. చిన్నప్పుడు మామిడి తోపుల్లో కాయలు దొంగతనం చేసి పంచుకున్న దగ్గర్నుంచీ, సముద్రం ఒడ్డున ఇసుకలో ఆడుతూ పాడుతూ కబుర్లు చెప్పుకొన్న వారి స్నేహం సముద్రంకన్నా లోతైనది. ఒకరికోసం ఒకరు ప్రాణం ఇచ్చేంతగా గాఢ స్నేహం వారి మధ్య అల్లుకుంది. చిన్నతనంలోనే తమ కులవృత్తి అయిన చేపలు పట్టడం కూడా ఇద్దరూ కలిసే నేర్చుకున్నారు. పెద్దవాళ్లతో కలిసి ఇద్దరూ సముద్రంలోకి వేటకు వెళ్లేవారు. ఏ పనిచేసినా, ఎక్కడ చూసినా ఇద్దరూ కలిసే కనిపించేవాళ్లు. వాళ్ల వయసుతోపాటే వాళ్ల స్నేహం కూడా దినదిన ప్రవర్ధమానమైంది. పన్నెండేళ్ల వయసులో ఇద్దరూ సముద్రంలోకి వేటకు వెళ్లారు. వాళ్లు సొంతంగా వేటకు వెళ్లడం అదే మొదటిసారి. వారి తండ్రులు చెప్పిన జాగ్రత్తలు పాటిస్తూ, ఇద్దరూ వేట పూర్తిచేసి తిరిగి రావడం.. గూడెం వాళ్లందరిలోనూ ఆనందాన్ని నింపింది. సముద్రం మీద వాళ్లు ఆడింది ఆటగా, పాడింది పాటగా చేపల వేట సాగేది. ఒకరోజు ఎప్పటిలాగే సముద్రంలోకి వెళ్లారు. అయితే ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే సముద్రం ఆరోజు భీకరరూపం దాల్చింది. అప్పటికే వాళ్లు తీరంనుంచి చాలాదూరం లోపలికి వెళ్లిపోయారు. ఒక్కసారిగా సముద్రం అల్లకల్లోలమైంది. వాళ్ల పడవ తలకిందులైంది. ఇద్దరూ నీళ్లలో చెరొకవైపు పడిపోయారు. ఇద్దరూ ఈదుతూ తమ పడవ దగ్గరికి చేరుకున్నారు. అయితే ఏడుకొండలు పడవ ఎక్కుతుండగా ఒక పెద్ద అల అతణ్ని మళ్లీ సముద్రం లోపలికి లాగేసింది. అది గమనించిన ఓబులేసు ఎంతో చాకచక్యంతో వ్యవహరించి, అతణ్ని పడవలోకి లాఘవంగా లాగేశాడు. ఓబులేసే గనక లేకుంటే. ఏడుకొండలు జీవితం ఆ రోజుతో ముగిసిపోయి ఉండేది. ఆ సంఘటన తర్వాత వాళ్ల మధ్య స్నేహం మరింత బలపడింది. అయితే ఒకానొక దుర్దినాన ఒక అనుకోని ప్రమాదంలో ఓబులేసు తల్లిదండ్రులు మరణించడంతో, అతని మనసు వికలమైపోయింది. ఎవరెంత చెప్పినా వినకుండా ఊరొదిలేసి ఎటో వెళ్లిపోయాడు. దొరికిన చోట, దొరికిన పనల్లా చేస్తూ చివరికి ముంబయి చేరుకున్నాడు. రకరకాల పనులు చేస్తూ అక్కడే స్థిరపడిపోయాడు. అదృష్టవశాత్తూ ఓబులేసు చేపట్టిన వ్యాపారం కలిసివచ్చి, అతనికి విపరీతమైన లాభాలను తెచ్చిపెట్టింది. దాంతో అనతికాలంలోనే అంచెలంచెలుగా పైకెగబాకాడు. క్రమేణా అతని కనుసన్నల్లో ఒక పెద్ద వ్యాపార సామ్రాజ్యమే ఏర్పడింది. అలాంటి గొప్పవాడు తనకోసం ప్రత్యేకంగా ముంబయి నుంచి వస్తుండటంతో ఏడుకొండలు సంతోషానికి హద్దులేదు. అతను చెప్పిన వార్త విని గూడెం వాళ్లంతా ఎంతో సంతోషించారు.

**మిత్రుడు వస్తున్న విషయం భార్యకు చెప్పి..**

"ఆనికి మనింట్లోనే భోజనం ఏర్పాటుసెయ్యి. సిన్నప్పుడు రొయ్యల ఇగురు శానా ఇట్టంగా తినేటోడు. గాబట్టి అది సెయ్యటం మర్సిపోవొద్దు" అని చెప్పాడు ఏడుకొండలు. "మీ దోస్తు గురించి నువ్వింతగనం సెప్పాల్నా? ఓబులెసన్న అంటే నీకెంత ఇట్టమో ఎన్నిసార్లు నువ్వు సెప్పలేదు నాకు. అదంతా నేను సూసుకుంటా" అని భరోసా ఇచ్చిందామె. ఆ గురువారం ఖద్దరు బట్టలు వేసుకుని, నల్ల కళ్లద్దాలు సవరించుకుంటూ వచ్చిన ఓబులేసు, దూరంగా నిలబడి తననే తదేకంగా చూస్తున్న ఏడుకొండలుని చూసి. "అరే ఏడుకొండలూ! మై జిగిరీ దోస్త్! ఏంటింకా అట్లా దూరంగానే ఉన్నావ్? రా రా" అంటూ దగ్గరికి పిలిచాడు. అతణ్ని చూసిన ఆనందంలో ఏడుకొండలు కళ్లవెంట నీరు ధారాపాతంగా కారిపోసాగింది. అది చూసి. 'ఏమిట్రా పిచ్చోడా? ఎందుకీ కన్నీళ్లు?" అంటూ ఆత్మీయంగా కౌగిలించుకున్నాడు ఓబులేసు. ఆరోజు అతణ్ని తమ ఇంట్లో భోజనానికి రమ్మని పిలిచాడు ఏడుకొండలు. రాకరాక తమ ఇంటికి వచ్చిన అతణ్ని లక్ష్మి సాదరంగా ఆహ్వానించింది.

**భోజనాలయ్యాక ఓబులేసు లక్ష్మితో..**

"వీడు నా ప్రాణస్నేహితుడు. ప్రేమాభిమానాలు కురిపించడంలో నువ్వుకూడా వాడికి తగ్గ భార్యవనిపించుకున్నావు. నువ్వు చేసిన రొయ్యల ఇగురు నాకెంతో ఇష్టం. నిజంగా ఇట్లాంటి భోజనం చేసి ఎన్నాళ్లయిందో! మీ ఇద్దరికీ చాలాచాలా థాంక్స్" అన్నాడు. "గదేందన్నా అట్లంటవ్. నీ అసుంటి గొప్పోడు మా ఇంటికి వొచ్చుడే ఎక్కువ. ఇది మా అదురుట్టం" అని లక్ష్మి అనడంతో అతను నవ్వేశాడు.

**తర్వాత ఏడుకొండల్ని చూస్తూ..**

"సర్లే! నీ గురించి చెప్పు. ఎట్లా ఉంది నీ పని? వేట లాభసాటిగా ఉందా?" అనడిగాడు. "ఎందుకుండదు? ఆ సముద్దరాన్ని నమ్ముకున్నాను. ఆ తల్లే ఇంత కూడు బెడుతున్నది. నా సంగతి సరే.. నువ్వు బొంబై బోయి ఎన్ని తిప్పలు వడ్డవో ఏమో తెల్వదు గానీ, మొత్తానికి గొప్ప యాపారయేత్తవైనావని అందరూ సెప్పుకొంటుంటే ఇన్నాను. శానా సంతోసం ఏసినాది" అన్నాడు. "ఈ బిజినెసుల్లో ఎన్ని తలనొప్పులో నీకేందెల్సు. సర్లే.. ఈ గొడవ ఎప్పుడూ ఉండేదే! అట్లా బీచికి వెళ్లి కాసేపు కబుర్లు చెప్పుకొందాం పద" అంటూ అతణ్ని బయల్దేరదీశాడు. లక్ష్మికి వీడ్కోలు చెప్పి ఏడుకొండలుతో కలిసి ఓబులేసు వెళ్లేసరికి, బీచ్ చాలా సందడిగా ఉంది. ఇద్దరూ వాళ్లు చిన్నతనంలో ఆడుకునే చోటుకే వెళ్లి కూర్చున్నారు. కొద్దిసేపు ఆ మాటా ఈమాటా మాట్లాడుకున్న తర్వాత. "ఒరే! నీ పడవ తియ్యిరా. సముద్రం మీదికి వెళ్లి చాలా రోజులైంది" అన్నాడు ఓబులేసు. అతనలా అడగడం ఆలస్యం.. ఏడుకొండలు వెంటనే అతణ్ని తన పడవ దగ్గరికి తీసుకెళ్లాడు. సముద్రం చిన్నచిన్న అలలతో నవ్వుతూ ఆ స్నేహితులిద్దరినీ ఆహ్వానించింది. అలా వాళ్లు మాటల్లోపడి తీరం నుంచి కాస్త దూరంగానే వెళ్లారు. ఆ సమయంలో ఉన్నట్లుండి అక్కడి వాతావరణంలో ఏదో మార్పు వచ్చింది. రక్తంతోనూ, సముద్రపు నీళ్లతోనూ తడిసిపోయి ఉన్న ఓబులేసు శరీరాన్ని ఏడుకొండలు భుజంపైన వేసుకుని రావడం చూసిన గూడెం జనం.. "ఏటయినాది%ౕ%" అంటూ అతని చుట్టూ గుమిగూడారు. ఓబులేసు శరీరాన్ని నేలపైకి దించిన ఏడుకొండలు, మౌనంగా ఆ శవాన్నే చూస్తుండిపోయాడు. అతను ఏడవడం కూడా మర్చిపోయేంతగా దిగ్భ్రాంతిలో మునిగిపోయి ఉన్నాడనీ అందరూ అర్థం చేసుకున్నారు. క్షణాల్లో అక్కడ పోలీసు వ్యాను ప్రత్యక్షమైంది.

**ఏమైందన్న పోలీసుల ప్రశ్నకు అతికష్టంమీద..**

"సముద్దరంలో సరదాగా శికారు సేద్దామని మా ఓబులేసు అడిగితే కాదనలేక పడవ తీసినాను సారూ! కాసింత లోపలికెల్లినంక ఒక పెద్ద అల వొచ్చి మా పడవను ఎంత గట్టిగా తాకిందంటే.. ఆ దెబ్బకు అది గింగరాలు తిరుగుతూ పైకి ఎగిరింది. మేము దాన్లోంచి నీళ్లల్లో పడిపోయినం. కానీ, దురదుట్టం ఏటంటే.. ఆ పైకెగిరిన పడవ సరిగ్గా వొచ్చి మా వోడి తలమీద పడినాది. దాంతో ఆడి తల పగిలినాది. ఎంటనే ఈడ్ని ఒడ్డుకు తెచ్చేసినా. కానీ, అప్పటికే రక్తం శానా కారిపోయినాది. ఒడ్డుకు తెచ్చేలోపల ఆడు.." ఇక ఏడుకొండలు నోట మాట పెగల్లేదు. ఇంకా పెళ్లికూడా కాని ఓబులేసు, అలా పుట్టిన ఊరిలోనే మట్టిలో కలిసిపోవడం అందరినీ ఎంతగానో కదిలించింది. అతని అంత్యక్రియలు ఏడుకొండలు చేతుల మీదుగానే జరిగాయి.అందరూ శ్మశానాన్ని విడిచిపోతున్నా ఏడుకొండలు మాత్రం అక్కడే స్నేహితుని చితికి కాస్త దూరంలో కూలబడి ఉండటం చూసి, అందరి మనసులూ ద్రవించాయి. తన ప్రాణాన్ని రక్షించిన ఓబులేసు, తన కళ్లముందే చనిపోవడం చూసిన అతను.. దిగ్భ్రాంతికి గురయ్యాడని అక్కడ అందరికీ అర్థమైంది. అతణ్ని ఓదార్చడం అక్కడ ఎవ్వరి తరమూ కాలేదు. "ఇక గూడేనికి పోదాం రా!" అంటూ ఎవరెంత బతిమిలాడినా అతను అక్కణ్నుంచి కదలలేదు. అతని వ్యథ అంత తేలిగ్గా తీరేది కాదనుకుంటూ ఒక్కొక్కరూ అక్కణ్నుంచి వెళ్లిపోయారు.

"మనం ఎంత బాధపడినా పోయినోడు తిరిగొత్తాడా సెప్పు. పొద్దుగాలనుంచి పిల్లలు బువ్వకూడా సరిగ్గా తినలేదు. నేనింటికెల్తున్నా. నువ్వా సీకటడకముందే వచ్చేయ్" అని చెప్పి.. అతని భార్య కూడా వెళ్లిపోయింది. అక్కడ అతను ఒంటరిగా మిగిలిపోయాడు. జరిగిందంతా అతనికి ఒక కలలాగా అనిపించసాగింది. ఒకసారి అది మొత్తం అతని కళ్లముందు గిర్రున తిరిగింది.

**ఓబులేసును పడవ ఎక్కించుకుని కొంతదూరం పోయాక..**

"ఇప్పుడు సెప్పు. ఇంకేటి సంగతులు!" అని అడిగాడు ఏడుకొండలు. "మన బెస్త గూడేలన్నిటికీ నువ్వే నాయకుడివి కాబట్టి నువ్వో పనిచేయాలి. అది చెబుదామనే నిన్నింత దూరం తెచ్చింది" అన్నాడు ఓబులేసు. "సెప్పు. నీకోసం ఏటైనా సేస్తా!" అన్నాడు ఏడుకొండలు. "చెప్తాను. నేనీ ఊర్లో ఒక ఫైవ్‌స్టార్ హోటల్లో దిగాను. అసలు నిన్నే అక్కడికి పిలుద్దామని అనుకున్నాను. కానీ గోడలకు చెవులుంటాయి. మా బిజినెస్‌లో ఎవ్వడినీ నమ్మకూడదు. కానీ, నువ్వు నా ప్రాణస్నేహితుడివి. అందుకే నిన్ను నమ్మాను. నా బిజినెస్ పార్ట్‌నర్‌గా చేయి కలుపుతానని మాటివ్వు" అన్నాడు ఓబులేసు. "నువ్వేటి సెబుతున్నావో నాకొక్క ముక్కగూడా అర్థం కాలేదు!". "అక్కడికే వస్తున్నా. నేను ముంబయిలో చేసే బిజినెస్‌కు కావాల్సింది అమ్మాయిలు.." అని ఒక్క క్షణం ఆగాడు ఓబులేసు. "అంటే.. అమ్మాయిలకు ఉజ్జోగాలు ఇచ్చే బిగినెస్సా?" అనడిగాడు ఏడుకొండలు.. పడవ తెడ్డు వేస్తూ. "ఓరి వెర్రి మొఖమా! నేను చెప్పేది పూర్తిగా విను. అరబ్బు దేశాల్లో మనదేశం అమ్మాయిలకు చాలా డిమాండుంది. డబ్బు ఆశ ఉన్నవాళ్లనూ, పేదవాళ్లనూ నేను ఎరవేసి పట్టుకుని, వాళ్లకు అరబ్బు దేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి తీసికెళ్లి.. అక్కడ షేకులకు అమ్మేస్తుంటాను" అంటూ చెప్పాడు ఓబులేసు.ఆ మాట వినగానే ఏడుకొండలు నిశ్చేష్టుడయ్యాడు. "గదేం బిగినెస్? పాపం కాదా?" అనడిగాడు. "పాపం %-% పుణ్యం అంతా ట్రాష్. డబ్బు ఒక్కటే నిజం. ఇక్కడ మన వాళ్లందరికీ నువ్వే లీడర్‌వు కాబట్టి.. ఇక్కడున్న మన కులపోళ్లలో మంచి వయసులో ఉన్న అమ్మాయిల్ని మెల్లిగా మాయమాటలు చెప్పి, ముంబయిలో నా దగ్గరికి పంపించు. కొద్దిరోజుల్లో నాలాగే నువ్వూ లక్షాధికారివై పోతావు!". "సీ.. సీ.. అంత నీతిమాలిన పని నేను జేస్తానని ఎట్టా అనుకున్నావు రా?".. ఛీత్కారంగా అన్నాడు ఏడుకొండలు. అప్పటిదాకా ఎంతో గౌరవంగా మాట్లాడిన మిత్రుడు.. ఒక్కసారిగా ఏకవచనంలోకి దిగడం ఓబులేసు గమనించాడు. అయినా దాన్ని పట్టించుకోకుండా. "ఇంకా ఈ నీతీ నిజాయితీ ఏంట్రా? చిన్నప్పటి నుంచీ నువ్వీ గర్భదరిద్రంలో మగ్గుతున్నావు. నిన్నెవరైనా కాపాడారా? నువ్వు నా ప్రాణ స్నేహితుడివి కాబట్టి నీకు లక్షలు సంపాదించే మార్గం చూపిస్తున్నాను. నువ్వూ నా దారిలోకి రా. కొద్దిరోజుల్లోనే నీ దశ తిరిగిపోతుంది" ఆశపెట్టాడు ఓబులేసు. "వొద్దురా! ఈ దరిద్రపు పని నేను సెయ్యను. నువు గూడా దీన్ని ఇక ఆపేసి ఇక్కడే నాతో ఉండిపో! నియ్యతిగా మనకొచ్చింది తిని బతుకుదాం" స్పష్టంగా చెప్పాడు ఏడుకొండలు "ఏంటీ.. వ్యాపారం ఆపెయ్యాలా? ఇక్కడే ఉండిపోవాలా? ఎంత తేలిగ్గా చెప్పావురా. ఇప్పుడు నేను ముంబయ వెళ్లకపోతే ఎన్ని డీల్స్ ఆగిపోతయో.. నాకెన్ని లక్షల నష్టం వస్తుందో తెలుసా? ఇక్కడ నువ్వు కాకపోతే ఇంకొకడు సహాయం చేస్తాడు. నాకు బోడి సలహాలు ఇవ్వడం మాని.. నాతో చెయ్యి కలుపుతావో లేదో చెప్పు" నిష్కర్షగా అడిగాడు ఓబులేసు. "నేను నీతో సెయ్యి కలపను. ఇంకొన్ని కలపనివ్వను".. అంతకంటే నిష్కర్షగా అన్నాడు ఏడుకొండలు. అంతే.. ఒక్కసారిగా అక్కడి వాతావరణంలో మార్పు వచ్చేసింది. గాలి గంభీరమైపోయింది. ఓబులేసు పడవలో లేచి నిలబడి. "కలపనివ్వనంటే.. ఏం చేస్తావు? అసలు నువ్వేం చేయగలవు? ఆఫ్టరాల్ ఒక అర్భక జాలరిగాడివి. నేను పెట్టిన ప్రాణభిక్షతో బతుకుతున్నవాడివి. నాకు నువ్వు పనికి వస్తావని ఇక్కడికి వచ్చానే గానీ, నీ మీద ప్రేమతో రాలేదు. నేనెంత కర్కోటకుడినో నీకు తెలీదు. నాలో జాలి %-% దయ అన్నవి ఏ కోశానా లేవు. నేను తలచుకుంటే నిన్నిక్కడే ఇప్పుడే జలసమాధి చేసి వెళ్లిపోగలను" అన్నాడు కర్కశంగా.

**అది విని ఏడుకొండలు..**

"అబం సుబం తెలీని ఆడబిడ్డల ఉసురు పోసుకుంటున్నావని తెలిసినప్పుడే నువ్వెట్టాంటోనివో నాకు అర్థమైంది. ఒకప్పుడు నువ్వు నాకు పేణబిచ్చ పెట్టింది నిజమే గావొచ్చు. అంతమాత్తరాన నువ్ సెప్పే నీతిమాలిన పని సేస్తానని ఎట్టా అనుకున్నావు? నేను ఒక నాయకున్నే కాదు, మానవత్వం ఉన్న మడిసిని కూడా! అందుకే ఎంతోమంది ఆడబిడ్డల్ని రచ్చించడం కోసం ఉప్పుడు నేనీ పని సెయ్యక తప్పడంలేదు. ఎందుకంటే నీలాంటోడు బతికుంటే ఇంకెంతమంది ఆడబిడ్డల బతుకులు బుగ్గిపాలు అవుతయో తెల్వదు" అంటూ.. అదాటున పోటెత్తిన అలలా లేచి, తన చేతిలో ఉన్న పడవ తెడ్డుతో ఓబులేసు తలపైన బలంగా ఓ దెబ్బ వేశాడు. ఒకే ఒక దెబ్బ. అంతే.. దాంతో ఓబులేసు తల రెండుగా విచ్చుకుంది. "అబ్బా.." అని పెద్దగా ఆర్తనాదం చేస్తూ అతను పడవలోంచి నీళ్లలోకి జారిపోయాడు. "నేను సేసిన ఈ పని ఏమాత్తరం తప్పుగాదని నాకు దెల్సు. ఒకేల తప్పయినా.. ఆ దేవుడు నన్ను తప్పకుండా సెమిస్తాడు!" అంటూ ఏడుకొండలు నీళ్లలోకి దూకి, ఓబులేసు శరీరాన్ని పడవలోకి ఎక్కించి, తీరానికి చేర్చాడు. ఆ ఓబులేసే ఒకప్పుడు ఏడుకొండలుకు ప్రాణభిక్ష పెట్టాడన్న సంగతి పోలీసువాళ్లకు గూడెంవాళ్లు చెప్పారు. అందుకే జరిగిందంతా దాచి, కొత్తగా కట్టుకథ అల్లి చెప్పిన ఏడుకొండలు మాటలను పోలీసులు కూడా విశ్వసించారు. వాళ్లకు అతనిపైన అణుమాత్రం అనుమానమైనా రాలేదు. జరిగిందంతా గుర్తుకు రావడంతో ఏడుకొండలు గాఢంగా నిట్టూర్చాడు. వెనుకనున్న సముద్రం మాత్రం అసలు అక్కడ ఏమీ జరగనట్లు, తానేమీ చూడనట్లు ప్రశాంతంగా ఉంది.

**గంద్రకోట సూర్యనారాయణ శర్మ**

'సంపాదన కన్నా.. నమ్ముకున్న విలువలే మిన్న!' అని నమ్మిన ఓ నిరుపేద జాలరి కథ 'పోటెత్తిన అల'. రచయిత గంద్రకోట సూర్యనారాయణ శర్మ. 'సూర్య గంద్రకోట' పేరుతో రచనలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలిలో పుట్టిపెరిగారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ (తెలుగు సాహిత్యం) చదివారు. తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో ఏజీఎంగా పనిచేసి, పదవీ విరమణ పొందారు. వివిధ ప్రక్రియల్లో రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా ఎంచుకున్నారు. ఈయన రాసిన కథల్లో 80 వరకు కథలు ప్రచురితమయ్యాయి. పాతిక పైగా కథలు వివిధ పోటీల్లో బహుమతులు గెలుచుకున్నాయి. ముప్పై వరకు కవితలు, గజల్స్ వివిధ పత్రికలలో అచ్చయ్యాయి. ఆనంద హేల, కలలు కౌముది, జాబిల్లి కోసం ఆకాశమల్లె నవలలు రాశారు. 'అసుర మేధం' 24 వారాల సీరియల్‌గా ప్రచురితమైంది. 'ఆనంద హేల' నవల పుస్తకరూపంలో విడుదలైంది. నమస్తే తెలంగాణ %-% ముల్కనూరు సాహితీ పీఠం నిర్వహించే కథల పోటీలో బహుమతి గెలుపొందడం ఇది రెండవసారి.

# స్త్రీలకు గండం అండాశయ క్యాన్సర్

ఒవేరియన్ (అండాశయ) క్యాన్సర్ స్త్రీలలో వచ్చే క్యాన్సర్లలో మూడో స్థానంలో ఉంటుంది. రొమ్ము క్యాన్సర్‌ది మొదటి స్థానం కాగా రెండో స్థానంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఆక్రమించాయి. ఇక అండాశయ క్యాన్సర్ లక్షణాలు అంత త్వరగా బయటపడవు. పైగా ఇది చాపకింద నీరులా శరీరంలో ఇతర భాగాలకు వ్యాపిస్తుంది. కాబట్టి, దీన్ని నిశ్శబ్ద హంతకిగా పేర్కొంటారు. ఈ క్యాన్సర్ మొదటి, రెండో దశల్లో స్వల్ప లక్షణాలు ఉండటంతో రోగులు వాటిని పెద్దగా పట్టించుకోరు. 60 నుంచి 70 శాతం మంది వ్యాధి ముదిరిన తర్వాతనే వైద్యులను ఆశ్రయిస్తుంటారు. దీంతో చాలామంది ఈ వ్యాధికి గురై తమ ఆరోగ్యాన్ని మరణం అంచులకు తీసుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో అండాశయ క్యాన్సర్ గురించి అవగాహన కలిగి ఉండాలి. అండాశయాల్లో క్యాన్సర్ కణాలు అపరిమితంగా పెరిగిపోయి పక్కన ఉన్న కణజాలానికి, ఇతర భాగాలకు వ్యాపించడాన్ని అండాశయ క్యాన్సర్ అంటారు. అండాశయాలు స్త్రీలలో గర్భాశయానికి రెండు వైపులా బాదం పప్పు పరిమాణంలో ఉంటాయి. ఇవి అండాల ఉత్పత్తితోపాటు ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ అనే హార్మోన్లను విడుదల చేస్తాయి. ఈ హార్మోన్లే స్త్రీలలో నెలసరికి దోహదపడతాయి. ఇవి సక్రమంగా విడుదలైనంత కాలం సంతాన లేమి, ఇతర గైనిక్ సమస్యలు దరిచేరవు. ఇక స్త్రీలకు ప్రమాదకరంగా పరిణమించే అండాశయ క్యాన్సర్ వంశ పారంపర్యంగా వచ్చే అవకాశం కూడా ఉంది. అయితే, ఇలా జరగడానికి కేవలం 5 నుంచి 10 శాతం అవకాశం మాత్రమే ఉంటుంది. మిగిలిన 90 శాతానికి కచ్చితమైన కారణాలను వివరించలేం.

**కుటుంబ నేపథ్యం ఉంటే**

రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్లకు ఒకే జన్యువు కారణమవుతుంది. దాన్ని బ్రాకా జన్యువుగా పిలుస్తారు. ఈ జన్యువు ఉన్నవారిలో రొమ్ము లేదా అండాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువ. అందుకని వంశంలో లేదా కుటుంబంలో ఎవరికైనా రొమ్ము క్యాన్సర్ గానీ, అండాశయ క్యాన్సర్ గానీ ఉంటే ఆ కుటుంబసభ్యులకు ఈ క్యాన్సర్లు వచ్చే అవకాశం 5 నుంచి 10శాతం వరకు ఉండొచ్చు. బ్రాకా జన్యువులో బ్రాకా-1, బ్రాకా-2 అని రెండు రకాలు ఉంటాయి. బ్రాకా-1: ఇది రొమ్ము, అండాశయానికి సంబంధించింది. ఇది ఉన్నవారిలో రొమ్ము, అండాశయ క్యాన్సర్లు వచ్చే అవకాశాలు అధికం. బ్రాకా-2: ఇది రొమ్ము, అండాశయంతోపాటు స్త్రీ, పురుషుల్లో పాంక్రియాటిక్ క్యాన్సర్, పురుషుల్లో ప్రొస్టేట్ క్యాన్సర్లకు కారణం అవుతుంది. కాబట్టి, కుటుంబ నేపథ్యం ఉన్నవారికి బ్రాకా పరీక్ష చేయించడం ఉత్తమం. ఈ పరీక్షలో బ్రాకా పాజిటివ్ వస్తే క్యాన్సర్ ముప్పు తగ్గించే సర్జరీలను ముందస్తుగా చేసి, రెండు అండాశయాలను తొలగించడం జరుగుతుంది.

**అండాశయ క్యాన్సర్ మూడు రకాలు**

అండాలు, స్త్రీ హార్మోన్లయిన ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్‌లను ఉత్పత్తి చేసే అండాశయాలలో అపరిమితంగా పెరిగే కణాల ఆధారంగా అండాశయ క్యాన్సర్ మూడు రకాలు. అవి:

1. ఎపిథీలియల్ ఒవేరియన్ క్యాన్సర్: 90శాతం వరకు వయసు పైబడిన స్త్రీలలో వస్తుంది.
2. జెర్మ్ సెల్ ఒవేరియన్ క్యాన్సర్: ఈ కణాలు అండాల నుంచి పుడతాయి. యుక్త వయసు అమ్మాయిలలో ఈ క్యాన్సర్ తలెత్తుతుంది.
3. స్ట్రోమల్ ఒవేరియన్ క్యాన్సర్: ఈ కణాలు అండాలలో హార్మోన్లు ఉత్పత్తి అయ్యే చోట తయారవుతాయి. స్త్రీలలో ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్లు చాలా ఎక్కువగా, దీర్ఘకాలికంగా విడుదలవుతూ ఉంటే ఈ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువ.



స్త్రీలలో వచ్చే క్యాన్సర్లలో అండాశయ క్యాన్సర్ 3వ స్థానంలో ఉంది. పైన పేర్కొన్న 3 రకాలే కాకుండా ఇంకా ఉప రకాలు ఉంటాయి. స్త్రీలలో 50ఏళ్లు పైబడిన తర్వాత ఎక్కువగా కనిపించే అండాశయ క్యాన్సర్‌ను నిశ్శబ్ద హంతకిగా పేర్కొనవచ్చు. లక్షణాలు ఆలస్యంగా బయటపడతాయి కాబట్టి వ్యాధి ముదిరిన తర్వాతే రోగులు డాక్టర్లను సంప్రదిస్తుంటారు. ఇలా ఎందుకు జరుగుతుందంటే%ౕ% అండాశయాలు పొత్తికడుపులో చాలా లోపలికి ఉంటాయి. కాబట్టి లక్షణాలు చాలా ఆలస్యంగా వెలుగుచూస్తాయి. అంతేకాకుండా అజీర్తి, యూరినరీ ఇన్ఫెక్షన్స్ వంటి లక్షణాలను సాధారణ సమస్యలుగా భావించే అవకాశం ఉంటుంది. తొలిదశలో ఈ లక్షణాలు అంత తీవ్రంగా లేకపోవడం వల్ల ఈ క్యాన్సర్‌ను గుర్తించడం అంత సులువు కాదు. అండాశయ క్యాన్సర్‌గా అనుమానించడానికి కొన్ని లక్షణాలు బయటపడవచ్చు.

లక్షణాలు: కడుపు ఉబ్బరంగా, నొప్పిగా ఉండటం. అజీర్తి, వికారం, తేన్పులు తదితర జీర్ణసంబంధ సమస్యలు. యోని స్రావాలు అసాధారణంగా ఉండటం. మూత్రం ఎక్కువగా లేదా తరచుగా రావడం. అలసట, జ్వరం. ఎక్కువగా లేదా అంతకుముందులా ఆహారం తీసుకోకపోవడం. కొంచెం తినగానే కడుపు నిండినట్టు ఉండటం. ఊపిరి కష్టంగా ఉండటం. కలయిక కష్టంగా అనిపించడం. వెన్నునొప్పి లేదా నడుము నొప్పిగా అనిపించడం. అకస్మాత్తుగా బరువు పెరగడం లేదా తగ్గడం. నెలసరి సక్రమంగా లేకపోవడం. ముందస్తు పరీక్షల్లో బ్రాకా పాజిటివ్ రావడంతో ప్రముఖ హాలీవుడ్ నటి ఏంజెలినా జోలీ ముందుజాగ్రత్తగా తన రెండు రొమ్ములు తొలగించుకుని రీకన్‌స్ట్రక్షన్ చేయించుకున్నారు. దీనివల్ల రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుంది.

**వీరిలో ఎక్కువ**

కుటుంబ నేపథ్యం కలిగిన స్త్రీలలో.
పిల్లలు కలగని వారు.
సంతానం కోసం అధిక మోతాదులో మందులు వాడిన వారిలో.
హార్మోన్ రిప్లేస్‌మెంట్ థెరపీని దీర్ఘకాలికంగా తీసుకున్న వారు.
కొవ్వు పదార్థాలు, మాంసాహారం ఎక్కువగా తీసుకునే వారిలో.
వ్యాధి నిర్ధారణ ఇలా
అనుమానిత లక్షణాలు ఉంటే అల్ట్రా సౌండ్‌లో సీఏ-125 మార్కర్ పరీక్ష చేయించుకోవాలి. దీంతోపాటు రక్త పరీక్షలు, పాప్ టెస్ట్ తదితర పరీక్షలతోపాటు సీటీ-స్కాన్, ఎంఆర్ఐ వంటివి కూడా అవసరమవుతాయి. రొమ్ము క్యాన్సర్‌కు కారణమయ్యే బ్రాకా జీన్ మ్యుటేషన్‌లో తేడాలు ఉన్నప్పుడు ఈ క్యాన్సర్ పరీక్షలు 25 ఏళ్ల వయసు నుంచి చేయించుకోవడం ఉత్తమం. మెనోపాజ్ దశకు ముందు నుంచే ఈస్ట్రోజన్ హార్మోన్‌ను మాత్రమే 5 నుంచి 10 ఏళ్ల కంటే ఎక్కువగా తీసుకుంటే ఈ క్యాన్సర్ వచ్చే ముప్పు పెరగవచ్చు. ప్రొజెస్టిరాన్ హార్మోన్ కాంబినేషన్‌లో ఈస్ట్రోజన్ తీసుకుంటే ఆ ముప్పు కొంతవరకు తగ్గేందుకు ఆస్కారం ఉంది. అన్ని క్యాన్సర్లలో లాగే అండాశయ క్యాన్సర్‌లోనూ 4 దశలు ఉంటాయి.

1వ దశ: వ్యాధి ఒకటి లేదా రెండు అండాశయాలకు మాత్రమే పరిమితమవుతుంది


2వ దశ: గర్భాశయానికి వ్యాప్తి చెందుతుంది.

3వ దశ: అండాశయాలు, గర్భాశయంతోపాటు లింఫ్ నాళాలు, పొత్తికడుపు లైనింగ్‌కు వ్యాపిస్తుంది.

4వ దశ: పైవాటితోపాటు శరీరంలో ఇతర అవయవాలకు సోకుతుంది.

సర్జరీ థెరపీలతో చికిత్స

వ్యాధి దశల ఆధారంగా సర్జరీ చేయడం, థెరపీలు వంటి చికిత్స ఇవ్వాల్సి ఉంటుంది. థెరపీలు ఎంతకాలం ఇవ్వాలో కూడా వ్యాధి ఉన్న దశపైనే ఆధారపడి ఉంటుంది. కుటుంబ నేపథ్యం ఉండి, బ్రాకా పాజిటివ్ వచ్చిన వారు పిల్లలు పుట్టిన తర్వాత ముందుజాగ్రత్తగా అండాశయాలను తొలగించుకోవచ్చు. ఒకవేళ క్యాన్సర్ ఉన్నట్టు నిర్ధారణ జరిగితే సర్జరీ, హైపెక్ కీమో థెరపీ చేస్తారు. హైపెక్ అనేది అత్యాధునిక చికిత్సా విధానం. ఇందులో సర్జరీ పూర్తయిన వెంటనే 41- 43 డిగ్రీల ఉష్ణోగ్రతతో కీమో ఇస్తారు. ఈ అండాశయ క్యాన్సర్ చికిత్స తర్వాత మళ్లీ 40 శాతం మందిలో తిరగబెట్టేందుకు ఆస్కారం ఉంది. అప్పుడు కూడా కీమో థెరపీతోనే చికిత్స అందిస్తారు. కొన్ని సందర్భాల్లో ఒక ప్రదేశంలోనే ఆలస్యంగా వస్తే రెండోసారి కూడా సర్జరీ చేయవచ్చు. మనోబలంతో ఉంటే మంచి ఫలితాలు, మెరుగైన జీవితాన్ని పొందడం సాధ్యమే.



## వార్ 2' లో తారక్ తెర మీదకొచ్చేదప్పుడే!




'వార్ 2' భారీ అంచనాల మధ్య రిలీజ్ కి రెడీ అవుతోంది. ఆగస్టు 14న భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతుంది. వార్ 2 భారీ అంచనాల మధ్య రిలీజ్ కి రెడీ అవుతోంది. ఆగస్టు 14న భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతుంది. దీంతో హృతిక్ రోషన్ -తారక్ పాత్రలు ఎలా ఉంటాయి? అన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ నెల కొంది. ఇందులో హీరో హృతిక్ రోషన్ కాబట్టి ఆ పాత్ర పరంగా చూసే పనిలేదు. తారక్ ప్రతి నాయకుడు పాత్ర కావ డంతో? అతడి పాత్ర ఎలా ఉంటుంది? అన్న దానిపై తెలుగు ఆడియన్స్ లో ఒకటే ఉత్కంఠ మొదలైంది. పాత్రలో ఏమాత్రం తేడా జరిగినా థియేటర్లు బద్దలైపోవడం ఖాయమే. ఆర్ ఆర్ ఆర్ సినిమా విషయంలో ఏం జరిగిందో తెలిసిందే. రామ్ చరణ్ పాత్రకు ధీటుగా తారక్ రోల్ లేక పోవడంతో అభిమానులు థియేటర్ల తలుపులు బద్దలు కొట్టడం..తెరను చించేయడం వంటి సన్నివేశాలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వార్ 2 లో తారక్ రోల్ పై ఆసక్తి నెలకొంది. అయితే తాజాగా అందుతోన్న సమాచారం ప్రకారం హీరోలిద్దరి మధ్య దెబ్బలాట మామూలుగా ఉండదంటున్నారు. తారక్ విలన్ పాత్ర పోషించినా? సినిమా ప్రారంభమైన పావు గంటకే ఆ పాత్ర ప్రత్యక్షమవుతుందని నిర్మాత నాగవంశీ అంటున్నాడు.తారక్ రోల్ పరిచయమైన దగ్గర నుంచి ముగింపు వరకూ ఒకే టెంపోలో ఆ రోల్ సాగుతుందిట. హీరో హృతిక్ రోషన్ పాత్రకు ఏమాత్రం తగ్గకుండా ఆరోల్ ఉంటుందని..పేరుకే విలన్ తప్ప తారక్ రోల్ చాలా ఎగ్జైటింగ్ గా ఉంటుందంటున్నారు. ఇద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు ఓ ఎత్తైతే..ఇద్దరు కలిసి డాన్సు చేయడం అన్నది సినిమాకు మరో ఎత్తులా నిలుస్తుందని ధీమా వ్యక్తమవుతోంది. మొత్తానికి ఈ ప్రచారంతో తారక్ రోల్ పై హైప్ రెట్టింపు అవుతుంది. అభిమానుల్ని ఏమాత్రం నిరుత్సాహ పరచుకుండానే తారక్ రోల్ ని డిజైన్ చేసి వదులుతున్నట్లు కని పిస్తుంది. మరి ఆ సంగతేంటో తేలాలంటే వచ్చే నెల 14 వరకూ వెయిట్ చేయాలి. ప్రస్తుతం తారక్ తెలు గులో ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో డ్రాగన్ చిత్రంలోనూ నటిస్తోన్న సంగతి తెలిసిందే.

## వోడ్కా బాటిల్‌తో రకుల్ లవ్ షురూ!



'కెరటం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన రకుల్ ప్రీత్ సింగ్ లక్కీగా 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాతో విజయాన్ని సొంతం చేసుకుంది. 'కెరటం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన రకుల్ ప్రీత్ సింగ్ లక్కీగా 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాతో విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ సినిమా తర్వాత రకుల్ ప్రీత్ సింగ్ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. తక్కువ సమయంలోనే టాలీవుడ్ స్టార్ హీరోలందరితోనూ సినిమాలు చేసింది. తెలుగులో ఒకానొక సమయంలో మహేష్ బాబు వంటి స్టార్ హీరో సినిమాకు డేట్లు ఇవ్వలేక పోయింది. మహేష్ బాబుతో ఈమె బ్రహ్మోత్సవం సినిమాలు చేయాల్సి ఉండగా డేట్లు లేకపోవడంతో ఆ సినిమా నుంచి తప్పుకుందని టాక్. మహేష్ బాబుతో ఆ తర్వాత స్పైడర్ సినిమాను చేసిన విషయం తెల్సిందే. ఇలా ఎంతో మంది టాలీవుడ్ స్టార్ హీరోలతో సినిమాలు చేసింది. టాలీవుడ్‌లో దాదాపు ఐదేళ్ల పాటు బిజీ బిజీగా గడిపిన రకుల్ ప్రీత్ సింగ్ మెల్ల మెల్లగా ప్రాభవం కోల్పోతూ వచ్చింది. ఒకసారి నటించిన హీరోలు మరోసారి ఈమెతో నటించేందుకు ఆసక్తి చూపించక పోవడంతో టాలీవుడ్‌లో ఆఫర్లు తగ్గాయి. ఆ సమయంలో లక్కీగా బాలీవుడ్ నుంచి పిలుపు వచ్చింది. తక్కువ సమయంలోనే బాలీవుడ్‌లో ఎక్కువ సినిమాలు చేసింది. అయితే అక్కడ కూడా ఆశించిన స్థాయిలో విజయాలను సొంతం చేసుకోలేక పోయింది. రెండేళ్ల పాటు బాలీవుడ్‌లో సినిమాలు చేసిన రకుల్ ప్రీత్ సింగ్ అక్కడ కూడా ఆఫర్లు లేకపోవడంతో ప్రస్తుతం అవకాశాల కోసం వెతుక్కుంటోంది. తాజాగా ఈమె ఫరాఖాన్ షో లో పాల్గొంది. ఆ సమయంలో జాకీ భగ్నానీతో ప్రేమ గురించి చెప్పుకొచ్చింది. గత సంవత్సరం జాకీ భగ్నానీతో రకుల్ ప్రీత్ సింగ్ పెళ్లి జరిగింది. వీరిద్దరి మధ్య పరిచయం ఎప్పుడు ఏర్పడింది, వీరి ప్రేమ ఎప్పటి నుంచి సాగుతుంది అంటూ చాలా మందిలో ప్రశ్నలు ఉన్నాయి. వాటన్నింటికి ఫరాఖాన్ కుకింగ్ వ్లాగ్ సందర్భంగా రకుల్ ప్రీత్ సింగ్ చెప్పుకొచ్చింది. రకుల్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ... కోవిడ్ 19 లాక్డౌన్ సమయంలో మొదటి సారి జాకీని కలిసినట్లు ఆమె చెప్పుకొచ్చింది. ఆ రోజు తన సోదరుడి పుట్టిన రోజు కావడంతో పార్టీ కోసం కజిన్స్ అంతా వోడ్కా బాటిల్ కోసం వెతికాం. ఆ సమయంలో అందరం కరోనా కారణంగా పీపీఈ కిట్లను ధరించి ఉన్నాం. అప్పుడే జాకీ ఇంటికి చేరుకున్నాం.

## టైట్ డ్రెస్‌లో అందాల అనన



బాలీవుడ్ నటుడు చుంకీ పాండే నట వారసురాలిగా 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2' సినిమాతో హిందీ సినిమా పరిశ్రమలో అడుగు పెట్టింది అనన్య పాండే. తండ్రి వారసత్వంతో ఇండస్ట్రీలో అడుగు పెట్టడంతో వరుసగా ఆఫర్లు దక్కాయి. కెరీర్ ఆరంభంలో హిట్, ఫ్లాప్‌తో సంబంధం లేకుండా అనన్య పాండే ఆఫర్లు దక్కించుకుంది. అయితే ఇండస్ట్రీలో ఈమె అడుగు పెట్టిన సమయంలోనే కరోనా కారణంగా రెండు ఏళ్ల పాటు కాస్త తక్కువ సినిమాలు చేయాల్సి వచ్చింది. కరోనా తర్వాత ఈమె బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తోంది. తెలుగులో ఈమె చేసిన లైగర్ సినిమా డిజాస్టర్‌గా నిలిచింది. దాంతో టాలీవుడ్ వైపు ఈమె తిరిగి చూడాలి అనుకోలేదు.ప్రస్తుతం బాలీవుడ్‌లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్న ఈమె సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఆకట్టుకునే అందంతో పాటు, రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఎప్పుడు ఏం చేసినా కూడా వాటిని ఫోటోలు తీసి ఇన్‌స్టాలో షేర్ చేసి అనన్య పాండే తాజాగా వర్కౌట్ డ్రెస్ ను ధరించి ఆ ఫోటోలను షేర్ చేసింది. అంతే కాకుండా స్విమ్ సూట్‌ను ధించిన సమయంలోనూ ఈమె సోషల్ మీడియాలో ఫోటోలను షేర్ చేయడం చూస్తూ ఉన్నాం. తాజాగా ఈ టైట్ డ్రెస్ ఫోటోలను షేర్ చేయడం ద్వారా అనన్య పాండే చూపు తిప్పనివ్వడం లేదు అంటూ నెటిజన్స్ తెగ కామెంట్స్ చేస్తున్నారు.ఈ ఫోటోల్లో అనన్య పాండే ఇంతకు ముందు కంటే చాలా అందంగా కనిపిస్తుందని నెటిజన్స్‌తో పాటు ఆమె ఫాలోవర్స్ కామెంట్స్ చేస్తున్నారు. సన్నగా నాజూకుగా ఉండే అనన్య పాండే ముందు ముందు బాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోయిన్‌గా నిలిచే అవకాశాలు ఉన్నాయని అభిమానులు కామెంట్ చేస్తున్నారు. అనన్య పాండేకి అందంతో పాటు నటన ప్రతిభ ఉంది. అందుకే ఆమె బాలీవుడ్‌లో ఈమె సరైన హిట్స్ పడకున్నా ఆఫర్లను అందుకుంటుంది అంటూ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 2019 నుంచి సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు తక్కువ సమయంలోనే మంచి పేరును సొంతం చేసుకుంది. అయితే నటిగా కమర్షియల్ హిట్ కోసం వెయిట్ చేస్తోంది.రొమాంటిక్ కామెడీ మూవీ స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2 లో నటించడం ద్వారా తన నటన ప్రతిభను కనబర్చే అవకాశం ను దక్కించుకున్న అనన్య పాండే ఆ తర్వాత పలు సినిమాల్లోనూ నటించింది. తాజాగా ఈమె కేసరి చాప్టర్ 2 సినిమాలో నటించింది. ఆ సినిమా కమర్షియల్‌గా ఫ్లాప్ అయినప్పటికీ నటిగా అందులో పర్వాలేదు అనిపించింది. ప్రస్తుతం ఈమె చేతిలో రెండు మూడు సినిమాలు ఉన్నాయి. వాటితో అయినా ఈమె కమర్షియల్ విజయాన్ని సొంతం చేసుకుంటుందేమో చూడాలి. ఇలాంటి అందమైన రూపం ఉన్న అనన్య పాండేకు లక్ కలిసి రాకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో ఆఫర్లు దక్కడం లేదు అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

## 4 బడా మూవీల రిలీజ్ మంత్స్.. అది నిజమేనా?

టాలీవుడ్ లో బడా హీరోలందరూ తమ అప్ కమింగ్ మూవీస్ తో బిజీగా ఉన్నారు. షూటింగ్స్ లో పాల్గొంటూ తమ షెడ్యూల్స్ ను పూర్తి చేస్తున్నారు. టాలీవుడ్ లో బడా హీరోలందరూ తమ అప్ కమింగ్ మూవీస్ తో బిజీగా ఉన్నారు. షూటింగ్స్ లో పాల్గొంటూ తమ షెడ్యూల్స్ ను పూర్తి చేస్తున్నారు. అందులో కొందరు ఇప్పటికే రిలీజ్ డేట్స్ ను లాక్ చేసుకున్నారు. మరికొందరు త్వరలో విడుదల తేదీలను అనౌన్స్ చేయనున్నారు. ఆ జాబితాల్లో చాలా మంది హీరోలున్నారు. అయితే కొంతకాలంగా బడా హీరోలు నటిస్తున్న సినిమాల విడుదల తేదీల ప్రకటనలు వస్తున్నప్పటికీ.. ఆ తర్వాత మాత్రం మారుతున్నాయి. అనేక కారణాల వల్ల ఛేంజ్ అవుతూ వస్తున్నాయి. ఇప్పుడు సోషల్ మీడియాలో ఓజీ, విశ్వంభర, అఖండ 2, రాజా సాబ్ సినిమాల విడుదలకు సంబంధించిన ఓ రూమర్ ఫుల్ గా స్ప్రెడ్ అవుతోంది. అది నిజమో కాదో తెలియక పోయినా.. వైరల్ మాత్రం అవుతోంది. సెప్టెంబర్ లో పవన్ కల్యాణ్ ఓజీ.. అక్టోబర్ లో చిరంజీవి విశ్వంభర.. డిసెంబర్ లో బాలకృష్ణ అఖండ-2.. 2026 జనవరిలో ప్రభాస్ రాజా సాబ్ రిలీజ్ అవుతాయని ఓ గాసిప్ చక్కర్లు కొడుతోంది. ఇందులో నిజమెంతో తెలియదు కానీ.. వైరల్ మాత్రం అవుతోంది. అయితే పవన్, సుజీత్ కాంబినేషన్ లో రూపొందుతున్న ఓజీ మూవీ.. సెప్టెంబర్ 25న రిలీజ్ చేస్తామని ఇప్పటికే ప్రకటించారు. రీసెంట్ గా ఆ విషయాన్ని క్లారిటీ కూడా ఇచ్చారు. దీంతో ఆ రూమర్ లో ఓజీడి రిలీజ్ మంత్ నిజమేనని చెప్పవచ్చు. ఆ విషయంలో ఎలాంటి అనుమానం అక్కర్లేదని ఫ్యాన్స్ చెబుతున్నారు. ఆ తర్వాత విశ్వంభర సినిమా విషయానికొస్తే.. చిరంజీవి, వశిష్ట కాంబినేషన్ లో తెరకెక్కుతున్న ఆ చిత్రం ఇప్పటికే థియేటర్స్ లో రిలీజ్ కావాల్సి ఉంది. కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. వీఎఫ్ ఎక్స్ వర్క్ పెండింగ్ ఉండడమే కారణంగా తెలుస్తోంది. ఇప్పుడు అక్టోబర్ లో సినిమా రిలీజ్ అవుతుందని ప్రచారం జరుగుతోంది. ఇక అఖండ-2 సెప్టెంబర్ లోనే విడుదల అవుతుందని మేకర్స్ అనౌన్స్ చేశారు. కానీ డిసెంబర్ కు పోస్ట్ పోన్ అవుతుందని వార్తలు వస్తున్నాయి. అయితే అనుకున్న డేట్ కే మేకర్స్ రిలీజ్ చేస్తున్నారని.. ప్రస్తుతం థియేటర్స్ అరేంజ్మెంట్స్ చేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. బోయపాటి శ్రీను ఆ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. అదే సమయంలో ప్రభాస్ లీడ్ రోల్ లో మారుతి రూపొందిస్తున్న రాజా సాబ్ డిసెంబర్ 5న రిలీజ్ కానుంది. దాన్ని వచ్చే సంక్రాంతికి పోస్ట్ పోన్ చేస్తారని రూమర్ స్ప్రెడ్ అవుతోంది. అయితే ఇప్పటికే సంక్రాంతికి పలువురు బడా హీరోలు చిత్రాలు కర్చీఫ్ వేసేశాయి. ఏదేమైనా ఓజీ తప్పితే.. రాజా సాబ్, విశ్వంభర, అఖండ-2 రిలీజ్ కు సంబంధించిన రిలీజ్ మంత్స్ గాసిప్ లో నిజమెంతో చూడాలి.




## వింబుల్డన్ వెళ్లే స్టార్స్‌పై సోఫీ ఆగ్రహం



తాజాగా ప్రముఖ నటి సోఫీ చౌదరి ఇన్‌స్టాగ్రామ్‌లో షాకింగ్ వ్యాఖ్యలు చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో వింబుల్డన్ కి హాజరు అయిన సెలబ్రిటీల గురించి ఇన్ఫ్లుయెన్సర్ల గురించి ఘాటు వ్యాఖ్యలు చేసింది. లండన్‌లో జరిగిన వింబుల్డన్ 2025 కి ప్రపంచ వ్యాప్తంగా వందల సంఖ్యలో సెలబ్రిటీలు హాజరు అయ్యారు. హాలీవుడ్ నుంచి ప్రపంచ దేశాలకు చెందిన ఎంతో మంది సినీ ప్రముఖులు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు పాల్గొన్నారు. అక్కడ ఫోటోలు దిగి సోషల్ మీడియాలో షేర్ చేయడంను చాలా మంది స్టేటస్‌గా భావిస్తున్నారు. తెలుగు దర్శకుడు సుకుమార్ తన భార్యతో కలిసి ఆటను చూసేందుకు వెళ్లిన విషయం తెల్సిందే. సోనమ్ కపూర్, అనుష్క శర్మ, విరాట్, అవ్నీత్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, జాన్వీ కపూర్, మిలింద్ ప్రీతీ జింటా, ఊర్వశి రౌతేలా ఇలా ఎంతో మంది ప్రముఖులు సైతం వింబుల్డన్‌ను చూసేందుకు వెళ్లారు. ఈసారి వింబుల్డన్ గేమ్‌లో బాలీవుడ్ సెలబ్రిటీలు ఎక్కువగా పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. హాలీవుడ్ సెలబ్రిటీలు సింపుల్‌గానే వింబుల్డన్‌ను చూసేందుకు వెళ్తే బాలీవుడ్ సెలబ్రిటీలు మాత్రం ఒక అవార్డ్ వేడుకలో హాజరు అయినట్లుగా అందంగా ముస్తాబయ్యారు. అంతే కాకుండా రెడ్ కార్పెట్ పై ఫోటోలు దిగినట్లుగా ఫోటోలు దిగి వాటిని సోషల్ మీడియా ద్వారా షేర్ చేయడంతో పాటు, తమ తమ పీఆర్ టీంలతో పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో పబ్లిసిటీ అయ్యేలా చేశారు. వింబుల్డన్ వెళ్లిన వారికి గుర్తింపు గౌరవం ఉంటుంది. అందుకే చాలా మంది ఖర్చు ఎక్కువ అయినా సరే అని అక్కడకు వెళ్లి ఫోటోలు దిగి షేర్ చేసిన వారు ఉన్నారు. తాజాగా ప్రముఖ నటి సోఫీ చౌదరి ఇన్‌స్టాగ్రామ్‌లో షాకింగ్ వ్యాఖ్యలు చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో వింబుల్డన్ కి హాజరు అయిన సెలబ్రిటీల గురించి ఇన్ఫ్లుయెన్సర్ల గురించి ఘాటు వ్యాఖ్యలు చేసింది. అక్కడకు వెళ్లిన వారిలో చాలామందికి ఆటపై ఆసక్తి లేదని, చాలా మంది వ్యక్తిగత అభిరుచితో వెళ్తే, కొందరు ఎంజాయ్ చేసేందుకు వెళ్లి ఉంటారని అభిప్రాయం వ్యక్తం చేసింది. వింబుల్డన్‌ను చాలా మంది సెలబ్రిటీలు ఫ్యాషన్ రన్ వేగా మార్చడం విడ్డూరంగా ఉందని, వారు చేసిన పనితో ముందు ముందు వింబుల్డన్ స్టేజ్ ఒక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ వేడుక మాదిరిగా మారే ప్రమాదం ఉందని సోఫీ చౌదరి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ పోస్ట్ చేసింది.

## వైరల్ వయ్యారితో మరోసారి దేవి మ్యాజిక్!



టాలీవుడ్‌లో మ్యూజికల్ హిట్స్ అంటే ఎక్కువగా గుర్తొచ్చే మ్యూజిక్ డైరెక్టర్స్ లలో దేవి శ్రీ ప్రసాద్ పేరు టాప్ లిస్టులో ఉంటుంది. టాలీవుడ్‌లో మ్యూజికల్ హిట్స్ అంటే ఎక్కువగా గుర్తొచ్చే మ్యూజిక్ డైరెక్టర్స్ లలో దేవి శ్రీ ప్రసాద్ పేరు టాప్ లిస్టులో ఉంటుంది. ఎన్నో బ్లాక్‌బస్టర్ ఆల్బమ్స్ తో ప్రేక్షకుల మన్ననలు పొందిన రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ తాజాగా "జూనియర్" సినిమాలోని "వైరల్ వయ్యారి" పాటతో మరోసారి తన టాలెంట్‌ను నిరూపించుకున్నాడు. కొత్త హీరో కిరీటి రెడ్డి, శ్రీలీల జంటగా నటిస్తున్న ఈ సినిమాలో.. ఈ మెలోడియస్ అండ్ మాస్ మిక్స్ చేసిన పాట హిట్ అయి, ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ పాటకు రీల్స్ మోత మొదలైపోయింది. ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేకుండా వయ్యారి పాట ప్రతి ఫోన్‌లో వినిపిస్తోంది. డీఎస్పీ కంపోజ్ చేసిన మ్యూజిక్ మాత్రమే కాదు, క్యాచీ లిరిక్స్ కూడా ట్రెండ్ అవుతున్నాయి. సంగీత ప్రవాహానికి తోడు, శ్రీలీల ఎక్స్‌ప్రెషన్స్, కిరీటి ఎనర్జీ పాటను మరింత ప్రత్యేకంగా మారుస్తున్నాయి. ఈ పాట ప్రత్యేకత ఏమిటంటే.. కొత్త హీరో కోసం డీఎస్పీ వేసిన సంగీతం ఇది. స్టార్ హీరో లేకపోయినా.. అలాంటి హై ఎనర్జీ సాంగ్ ఇవ్వగల శక్తి డీఎస్పీకే సాధ్యమవుతుంది. తను చేసే ప్రతీ పనిలోనూ డెడికేషన్, కష్టపడే పనితనం కనిపిస్తాయి. అందుకే చిన్న సినిమాగా స్టార్ట్ అయిన "జూనియర్" మూవీకి నేషనల్ లెవెల్ రిచ్ వచ్చింది. ఇటీవల కాలంలో పుష్ప 2, తండేల్, కుబేరా సినిమాలకి సంగీతం అందించిన డీఎస్పీ.. ఇప్పుడు "జూనియర్" పాటతో మరో మ్యూజిక్ సంచలనం నమోదు చేశాడు. ఆయన్ని ఎందుకు హిట్ మెషీన్ అంటారో మరోసారి రుజువైంది. పాటలతో సినిమాల రేంజ్‌ను పెంచగల సత్తా ఉన్న మ్యూజిక్ డైరెక్టర్ అని చెప్పకనే చెప్పాలి. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ పాటకు డ్యాన్స్ చేసే సెలబ్రిటీలు, ఫ్యాన్స్ వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఇక డీఎస్పీ చేసిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా సినిమాలో హైలైట్ అయ్యే అవకాశం ఉంది. "కుబేరా" టీజర్‌లో వినిపించిన బీజీఎమ్ ఇప్పటికే ప్రేక్షకులను ఫిదా చేసింది. అలాగే "వైరల్ వయ్యారి" పాట సినిమా రిలీజ్‌కి ముందు ఓ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది.

%Editor, Printed, Published and Owned by RACHAKONDACHANDRASEKHAR RAO%, »»%HNO-14-15/3, INDIRA GANDHI NAGAR, VELDURTHI, VELDURTHI MANDAL, KURNOOL DIST, ANDHRAPRADESH..RNI APTEL/2023/88231 Printed at SK PUBLICATIONS, S.NO-46-683-A. BUDHAWARA PETA, KURNOOL DIST-518002, AP . E-mail: yuvatharamtelugudaily@gmail.com, Cell: +9199899 24749.